@vaartanews @mvnewstv
www.mivaartanews.com
TGBIL/25/A0512
మన వార్త
AP EDITION
ప్రతి అక్షరం... ప్రజల కోసం
విజయవాడ
మంగళవారం 20 అక్టోబర్ 2026
సంపుటి : 2
సంచిక : 260
పేజీలు : 8 వెల : 5/-

వార్త
విలేకరులు కావలెను
ఈ క్రింది నెంబర్లకు వాట్సప్ ద్వారా తమ వివరాలు పంపగలరు
96763 94932

తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ప్రజాదరణ పొందుతున్న మీ వార్తన్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రికకు విలేకరులు కావలెను
ఆసక్తి అనుభవం కలిగిన వారు సంప్రదించగలరు.
జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గాల వారీగా ఆర్‌సీ ఇంచార్జీలు, మండలాల వారీగా విలేకరులు కావలెను.
సీనియర్లకు ప్రాధాన్యం
కొత్తవారికి అవకాశం ఉంటుంది

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL




## అభివృద్ధి, సంక్షేమమే

# ఎన్డీఏ అజెండా

- స్థానిక సంస్థల్లోనూ కూటమికి జై కొట్టండి
- సీఎం చంద్రబాబు పిలుపు
- ట్రిపుల్ ఇంజన్ సర్కారుతో అభివృద్ధి మూడు రెట్ల వేగంతో సాగుతుందని హామీ
- అభ్యర్థుల ఎంపికలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు 63.6 శాతం స్థానాలు కేటాయింపు
- విద్యావంతులకు, విధ్వంసకారులకు మధ్య జరుగుతున్న పోరు ఈ ఎన్నికలు
- గత ప్రభుత్వ హయాంలోని అరాచకాలపై వీడియోలను ప్రదర్శించిన ముఖ్యమంత్రి
- మేయర్లు, మున్సిపల్ ఛైర్‌పర్సన్లను ప్రజలే నేరుగా ఎన్నుకునే విధానాన్ని తీసుకొచ్చాం



**అమరావతి**

సార్వత్రిక ఎన్నికల మాదిరిగానే స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ ఎన్డీఏ కూటమికి పట్టం కడితే, కేంద్రం, రాష్ట్రం, స్థానిక ప్రభుత్వాల కలయికతో 'ట్రిపుల్ ఇంజన్' వేగంతో అభివృద్ధి పరుగులు పెడుతుందని ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబు అన్నారు. ప్రజాస్వామ్య పునాదులను మరింత పటిష్ఠం చేసేలా ఈ ఎన్నికల ఫలితాలు ఉండాలని ఆకాంక్షించారు. సోమవారం అమరావతిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమా వేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక ఎన్నికలతో క్షేత్రస్థాయిలో నాయకత్వం బలపడుతుందని, అందుకే సమర్థవంతమైన నాయకత్వాన్ని ప్రజలకు అందించాలనే లక్ష్యంతో అభ్యర్థుల ఎంపికలో ఎన్నడూ లేనంత కసరత్తు చేస్తున్నామని వివరించారు. - మిగతా3లో



## మైదుకూరు పురపాలక ఎన్నిక వాయిదా మళ్లీ నోటిఫికేషన్ ఇస్తాం

- కలెక్టర్ పంపిన నివేదికతో కడప జిల్లా మైదుకూరు మున్సిపాలిటీ ఎన్నికను రద్దు చేస్తున్నట్లు ఎస్ఈసీ తెలిపారు. మళ్లీ ఎప్పుడు ఎన్నికలు నిర్వహించేది త్వరలో తదుపరి నోటిఫికేషన్ ఇస్తాం
- ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకున్నాం

**అమరావతి**

వైఎస్ఆర్ కడప జిల్లా మైదుకూరులో మున్సిపల్ ఎన్నికలు వాయిదా వేసినట్లు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనీల్ చంద్ర పునేఠా ప్రకటించారు. నామినేషన్ పత్రాలను చించివేసినందున వాటి పరిశీలన కష్టమని అందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. అక్కడి జిల్లా కలెక్టరు నుంచి వచ్చిన నివేదిక మేరకు మైదుకూరులో - మిగతా3లో

## భారత్ ఫ్రాన్స్ కాదు బంగ్లాదేశ్ అంతకన్నా కాదు

- మా డిమాండ్ స్వేచ్ఛాయుత ఎన్నికలే: శశి థరూర్
- పాలన మార్పు కుట్ర ఆరోపణలను కాంగ్రెస్ ఖండించింది
- నిరసనలు, అల్లర్ల మధ్య తేడాను గుర్తించాలన్న కాంగ్రెస్ నేతలు

## స్థానిక ఎన్నికల్లో కేంద్ర బలగాలు

# అవసరం లేదు



- వైఎస్సార్సీపీ పిటిషన్‌ను కొట్టేసిన హైకోర్టు
- స్థానిక సంస్థల ఎన్నికల్లో కేంద్ర బలగాలను మోహరించాలంటూ వైఎస్సార్సీపీ దాఖలు చేసిన అప్పీల్ పిటిషన్‌ను ఆంధ్రప్రదేశ్ హైకోర్టు డివిజన్ బెంచ్ కొట్టివేసింది.

**అమరావతి**

ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల వేళ ప్రధాన ప్రతిపక్షం వైఎస్సార్సీపీకి హైకోర్టులో మరోసారి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో కేంద్ర సాయుధ పోలీసు బలగాలను (సీఏపీఎఫ్) మోహరించేలా రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని (ఎస్ఈసీ) ఆదేశించాలని కోరుతూ వైఎస్సార్సీపీ దాఖలు చేసిన అప్పీల్ పిటిషన్‌ను హైకోర్టు డివిజన్ బెంచ్ కొట్టివేసింది. ఎన్నికల బందోబస్తుకు కేంద్ర బలగాలను రప్పించాలని కోరుతూ వైఎస్సార్సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి గతంలో హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను విచారించిన - మిగతా3లో



## ఈ వారం దక్షిణాదిలో భారీ వర్షాలు

- దేశంలో అన్ని ప్రాంతాల వాతావరణ పరిస్థితులను ఐఎండీ అంచనా
- ఉత్తర, మధ్య భారతదేశంలో ఈ వారం వాతావరణం పొడిగా ఉంటుంది
- దక్షిణాది రాష్ట్రాల్లో వర్షం పడుతుందని తెలిపింది.
- పశ్చిమ భారతదేశంలో పగటిపూట అధిక ఉష్ణోగ్రతలు, తీర ప్రాంతాల్లో తేమ వాతావరణం



## రోడ్డును దున్నేసినందుకు

# సిగ్గుపడాలి

- పుల్లంపేట మండలంలో కొత్తగా వేసిన రోడ్డును ధ్వంసం చేశారని ఆరోపణ
- వైసీపీ నేతలే ట్రాక్టర్‌తో రోడ్డును తవ్వేశారన్న మంత్రి నారా లోకేశ్
- రూ.4.75 కోట్లతో నిర్మించిన రోడ్డు అని వెల్లడి
- ఇది కక్షపూరిత చర్య అని, ప్రజలపై దాడి అని తీవ్ర ఆగ్రహం
- బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్, పోలీసులకు విజ్ఞప్తి

**అమరావతి**

తిరుపతి జిల్లా పుల్లంపేట మండలంలో దారుణమైన ఘటన చోటుచేసుకుందని, వైసీపీ నాయకుల కక్షపూరిత చర్యలకు ఇది నిదర్శనమని ఏపీ మంత్రి నారా లోకేశ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న ప్రజల కోసం రూ.4.75 కోట్లతో నిర్మించిన తారు రోడ్డును, వేసిన నాలుగు రోజులకే వైసీపీ నేతలు ట్రాక్టర్‌తో ధ్వంసం చేశారని ఆయన ఆరోపించారు. ఈ చర్య దిగ్భ్రాంతికరమని, సిగ్గుచేటని ఆయన అభివర్ణించారు. పుల్లంపేట మండలంలోని అనంతసముద్రం, పాపక్కగారిపల్లె గ్రామాల ప్రజల సౌకర్యార్థం - మిగతా3లో

## ప్రభుత్వ ఆస్తుల ధ్వంసం

# క్షమించరాని నేరం

- రోడ్డు ధ్వంసం చేసిన వారిపై నాన్ బెయిలబుల్ కేసు పెట్టండి.. నష్టాన్ని వారి నుంచే వసూలు చేయండి: పవన్ కల్యాణ్
- తిరుపతి జిల్లాలో కొత్తగా వేసిన రోడ్డును ధ్వంసం చేసిన ఘటన
- వైసీపీ నేత సుబ్బారెడ్డిపై నాన్ బెయిలబుల్ కేసు నమోదుకు పవన్ ఆదేశం
- నష్టాన్ని నిందితుల నుంచే వసూలు చేయాలని అధికారులకు సూచన
- 'పల్లె పండుగ 3.0' కింద వారం క్రితమే రోడ్డు నిర్మాణం



**అమరావతి**

ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేసే వారిపై కఠిన చర్యలు తప్పవని, వారిని ఏమాత్రం ఉపేక్షించేది లేదని ఏపీ డిప్యూటీ సీఎం, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. తిరుపతి జిల్లా, పుల్లంపేట మండలం అనంత సముద్రం-పాపక్కగారిపల్లె గ్రామాల మధ్య కొత్తగా నిర్మించిన రోడ్డును వైసీపీ నేత ధ్వంసం చేసిన ఘటనపై ఆయన తీవ్రంగా స్పందించారు. ఈ ఘటనకు బాధ్యులైన వారిపై నాన్ బెయిలబుల్ కేసు నమోదు చేయాలని, ధ్వంసమైన రోడ్డుకు అయిన ఖర్చును వారి నుంచే - మిగతా3లో



## ఉక్రెయిన్‌పై రష్యా భీకర దాడులు.. శాంతికి తాము సిద్ధమే

- శాంతి ప్రయత్నాలకు క్షిపణులే రష్యా సమాధానమన్న జెలెన్‌స్కీ
- రష్యా దాడికి తాము ఎదురుదాడి చేయాల్సి వస్తోందని వెల్లడి
- మిత్ర దేశాల నుంచి క్షిపణి హెచ్చరికలు అందలేదన్న ఉక్రెయిన్

## షైదుబాయ్ ఘటన: ప్లంబర్ కథనంపై స్పందించిన భారత పైలట్ స్మిత్ మచ్చర్



- షైదుబాయ్ విమాన ఘటనపై స్పందించిన భారత పైలట్ స్మిత్ మచ్చర్
- విమానాన్ని ప్లంబర్ కాపాడాడన్న ప్రచారాన్ని కెప్టెన్ వివరణ
- ఆ సమయంలో విమానాన్ని కాపాడటంపైనే నా దృష్టి ఉంది
- దాడి తర్వాత ఏం జరిగిందో పూర్తిగా గుర్తులేదని వెల్లడి

# ఈ వారం దక్షిణాదిలో భారీ వర్షాలు

బంగాళాఖాతంలో ఏర్పడిన తుపాను ఆవర్తనం, అరేబియా మహా సముద్రంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడన ప్రభావం కారణంగా దక్షిణాది రాష్ట్రాల్లో ఈ వారం భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) అంచనా వేసింది. అక్టోబర్ 24 వరకు కేరళ, మహే, లక్షద్వీప్, దక్షిణ కర్ణాటక, తమిళనాడు, పుదుచ్చేరి, కారైకల్ ప్రాంతాలలో విస్తారంగా వర్షాలు కురుస్తాయని పేర్కొంది. కోస్తాంధ్ర, రాయలసీమ, తెలంగాణలో కూడా అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వానలు పడతాయని తెలిపింది. అలాగే ఆ సమయంలో గంటకు 30-50 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తాయని వెల్లడించింది. కోస్తాంధ్ర, యానాం, రాయలసీమ ప్రాంతాలలో బలమైన ఉపరితల గాలులు వీస్తాయని చెప్పింది. దేశవ్యాప్తంగా ఉన్న వాతావరణ పరిస్థితులను ఐఎండీ సోమవారం అంచనా వేసింది.



**దిల్లీ పరిసర రాష్ట్రాల్లో వాతావరణ పరిస్థితులు**

వాయువ్య, మధ్య, తూర్పు, ఈశాన్య, ఉత్తర భారతదేశంలో ఈ వారం మొత్తం పొడి, స్థిరమైన వాతావరణం ఉంటుందని ఐఎండీ అంచనా వేసింది. ఇది బహిరంగ పండగ కార్యక్రమాలకు అనువైన పరిస్థితులను అందిస్తుందని అభిప్రాయపడింది. హరియాణా, చండీగఢ్, దిల్లీలో పొడి వాతావరణ పరిస్థితులు ఉంటాయని స్పష్టం చేసింది. తద్వారా బహిరంగ వేడుకలు, ఫుడ్ స్టాల్స్‌కు వర్షం అంతరాయం కలిగించే అవకాశం లేదని వెల్లడించింది. ఆయా ప్రాంతాల్లో ఎండ కారణంగా పగటిపూట ఉష్ణోగ్రతలు 31డిగ్రీల నుంచి 34డిగ్రీల మధ్య ఉంటాయని పేర్కొంది. అయితే సాయంత్రం సమయానికి వాతావరణం చల్లబడుతుందని వివరించింది. రాత్రిపూట కనిష్ట ఉష్ణోగ్రతలు ఆహ్లాదకరమైన 18డిగ్రీల-20డిగ్రీల పరిధికి పడిపోతాయని చెప్పింది. దిల్లీలో వాయు నాణ్యత సూచీ 135గా ఉందని, ఛావ్లా (210), చాందినీ చౌక్ (209), ఆర్కే పురం (207) వంటి రద్దీగా ఉండే ప్రాంతాలు పేలవమైన (ఆరెంజ్) కేటగిరిలోకి పడిపోయాయని వెల్లడించింది.

**ఐఎండీ అంచనా ప్రకారం**

ఉత్తరాదిన ఉన్న పొడి వాతావరణ పరిస్థితులకు భిన్నంగా దక్షిణాదిలో వర్షాలు దంచికొట్టనున్నాయి. అక్టోబర్ 24 వరకు తమిళనాడు, పుదుచ్చేరి, కారైకల్, కేరళ, దక్షిణ కర్ణాటక ప్రాంతాలలో అక్కడక్కడ భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఆంధ్రప్రదేశ్‌లోని కోస్తాంధ్ర, రాయలసీమ, తెలంగాణలోని పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులు, గంటకు 30-50 కిలోమీటర్ల వేగంతో వీచే ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురుస్తాయి.

**వాయువ్య, మధ్య భారతదేశం**

పంజాబ్, హరియాణా, రాజస్థాన్, ఉత్తర్‌ప్రదేశ్, మధ్యప్రదేశ్‌తో సహా వాయువ్య, మధ్య భారతదేశంలోని విశాలమైన మైదాన ప్రాంతాలలో వాతావరణం పొడిగా ఉంటుంది. గత 24 గంటల్లో పశ్చిమ మధ్యప్రదేశ్‌లో అక్కడక్కడా భారీ వర్షాలు కురిసినప్పటికీ (గుణలో 12 సెం.మీ. వర్షపాతం నమోదైంది), ఈ వారం మిగిలిన రోజుల్లో పొడి వాతావరణం ఉంటుంది.

**తూర్పు, ఈశాన్య భారతదేశం**

రాబోయే రోజుల్లో తూర్పు, ఈశాన్య భారత దేశంలోనూ పొడి వాతావరణ పరిస్థితులు ఉంటాయి. బంగాల్, ఒడిశా, బిహార్, అసోంలలో పండుగ వేడుకలకు వాతావరణం అనుకూలంగా ఉంటుంది. అసోం, మేఘాలయ, బంగాల్, సిక్కిం, రాజస్థాన్‌లలో కనిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే గణనీయంగా ఎక్కువగా ఉన్నాయి. దీంతో ఉదయం పూట వేడి వాతావరణ పరిస్థితులు ఉంటాయని ఐఎండీ అంచనా వేసింది.

**పశ్చిమంలోనూ పొడి వాతావరణమే**

పశ్చిమ భారతదేశంలో పగటిపూట అధిక ఉష్ణోగ్రతలు, తీర ప్రాంతాల్లో తేమ వాతావరణం ఉంటుంది. గుజరాత్‌లోని రాజ్‌కోట్‌లో దేశంలోనే అత్యధిక గరిష్ట ఉష్ణోగ్రత 39.9డిగ్రీలుగా నమోదైంది. సౌరాష్ట్ర, కచ్, గుజరాత్ ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా ఉన్నాయి. మరోవైపు, కొంకణ్, గోవా తీర ప్రాంతాల్లో తేలికపాటి వర్షాలు కురిశాయి (రత్నగిరిలో 1 సెం.మీ వర్షపాతం నమోదైంది). అయితే, రాబోయే రోజుల్లో పశ్చిమ భారతదేశమంతటా పొడి వాతావరణమే కొనసాగే అవకాశం ఉంది. దక్షిణాదిలో మినహా దేశంలోని అన్ని ప్రాంతాల్లో పొడి వాతావరణ ఉండనుందని ఐఎండీ పేర్కొంది.

## ఉక్రెయిన్‌పై రష్యా భీకర దాడులు..
## శాంతికి తాము సిద్ధమే



యుద్ధాన్ని ముగించేందుకు తాము దౌత్యపరమైన అన్ని ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ, రష్యా మాత్రం దాడులతోనే సమాధానమిస్తోందని ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలొదిమిర్ జెలెన్‌స్కీ ఆవేదన వ్యక్తం చేశారు. కాల్పుల విరమణ కోసం వచ్చిన ప్రతి ప్రతిపాదనకు తాము సానుకూలంగా స్పందించామని, కానీ రష్యా హింసామార్గం వీడటం లేదని ఆయన ఆరోపించారు. రష్యా సైన్యం బాలిస్టిక్ క్షిపణులు, వివిధ రకాల డ్రోన్లతో కీవ్‌తో పాటు పలు నగరాలపై విరుచుకుపడిందని ఆయన తెలిపారు. ఈ నేపథ్యంలో అనివార్యంగా తాము ఎదురుదాడికి దిగాల్సి వస్తోందని చెప్పారు. విన్నిట్సియా, కీవ్, మైకోలైవ్, ఖార్కివ్, ఒడెస్సా సహా 11 ప్రాంతాల్లోని ఇంధన మౌలిక సదుపాయాల కేంద్రాలే లక్ష్యంగా ఈ దాడులు జరిగాయని, వీటిలో పదికి పైగా కేంద్రాలు ధ్వంసమయ్యాయని జెలెన్‌స్కీ పేర్కొన్నారు. "మేం ఈ యుద్ధాన్ని ఎన్నడూ కోరుకోలేదు. గౌరవప్రదంగా యుద్ధాన్ని ముగించేందుకు మా మిత్ర దేశాలు చేసిన ప్రతి ప్రయత్నాన్ని స్వాగతించాం. కానీ రష్యా మాత్రం పదేపదే బాలిస్టిక్ క్షిపణులు, డ్రోన్ దాడులు, హత్యలతోనే ప్రతిస్పందిస్తోంది" అని ఆయన వ్యాఖ్యానించారు. యుద్ధాన్ని ఆపేందుకు లేదా ఉద్రిక్తతలను తగ్గించేందుకు రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు ఏమాత్రం ఆసక్తి లేదని ఆయన విమర్శించారు. గత కొంతకాలంగా అమెరికా తీసుకుంటున్న కొన్ని నిర్ణయాలు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌కు పరోక్షంగా ప్రయోజనం చేకూరుస్తున్నాయని జెలెన్‌స్కీ ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా మాస్కోపై ఉన్న ఆంక్షలను వాషింగ్టన్ సడలించడం, రష్యా నుంచి డీజిల్ దిగుమతి చేసుకునేందుకు ఒప్పందం చేసుకోవడం వంటి చర్యలను ఆయన తప్పుబట్టారు. రష్యా దాడులకు సంబంధించిన నిఘా సమాచారాన్ని గతంలో పంచుకున్న భాగస్వామ్య దేశాలు, ఇప్పుడు ఆ విషయంలో మౌనం వహిస్తున్నాయని వాపోయారు. అమెరికా తయారీ 'పేట్రియాట్' గగనతల రక్షణ వ్యవస్థల కొరత కూడా తమ దేశాన్ని రక్షణ పరంగా మరింత బలహీన పరిచిందని ఆయన పేర్కొన్నారు.

# 1 వారాల గర్భాన్ని తొలగించుకునేందుకు అత్యాచార బాధితురాలికి హైకోర్టు అనుమతి

16 ఏళ్ల లైంగిక దాడి బాధితురాలైన మైనర్ బాలికకు 31 వారాల గర్భాన్ని వైద్యపరంగా తొలగించుకునేందుకు దిల్లీ హైకోర్టు అనుమతి మంజూరు చేసింది. సాధారణంగా మెడికల్ టెర్మినేషన్ ఆఫ్ ప్రెగ్నెన్సీ యాక్ట్ ప్రకారం- సాధారణ కేసుల్లో 20 వారాలు, రేప్ బాధితులు వంటి ప్రత్యేక వర్గాలకు 24 వారాల వరకు మాత్రమే గర్భస్రావానికి చట్టపరమైన అనుమతి ఉంటుంది. అయితే మైనర్ బాధితురాలి శారీరక, మానసిక పరిస్థితుల్ని దృష్టిలో ఉంచుకొని కోర్టు ఈ మినహాయింపు ఇచ్చింది. దీంతో ఆ బాలికకు ఉపశమనం లభించింది. బాలిక కౌమార దశలో ఉన్న సమయంలో ప్రసవం, శిశువు పెంపకం వంటి బాధ్యతలు మోయాలని ఆశించడం సరికాదని కోర్టు వ్యాఖ్యానించింది. జస్టిస్ మినీ పుష్కర్ణ నేతృత్వంలోని ధర్మాసనం ఈ కేసును విచారించింది. ప్రెగ్నెన్సీ కొనసాగితే తనకు తీవ్రమైన మానసిక వేదన కలుగుతుందని బాధితురాలు, ఆమె తల్లి పేర్కొంటూ అబార్షన్‌కు అనుమతి ఇవ్వాలని కోర్టును ఆదేశించారు. మైనర్ బాలిక అత్యాచారానికి గురైన సందర్భంలో ప్రెగ్నెన్సీని కొనసాగించాలా? వద్దా? అనే అంశాన్ని కేవలం లైంగిక దాడికి గురైన మహిళ హక్కుగా మాత్రమే చూడలేమని హైకోర్టు పేర్కొంది. గర్భాన్ని తొలగించడానికి అనుమతి నిరాకరిస్తే బాధితురాలి గౌరవప్రదమైన జీవనంపై ప్రభావం పడుతుందని, అందువల్లే ఇది మానవ హక్కులకు సంబంధించిన అంశం కూడా అని స్పష్టం చేసింది. ఇంకా బాలికే స్వయంగా కౌమార దశలో ఉన్నప్పుడు ఆమెపై ప్రసవం, పిల్లల పెంపకం బాధ్యతల్ని మోపడం సముచితం కాదని జస్టిస్ మినీ పుష్కర్ణ వ్యాఖ్యానించారు. అందుకే బాధితురాలి ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని గర్భాన్ని తొలగించుకునేందుకు అనుమతించారు.




**24 వారాల వరకే అబార్షన్‌కు ఛాన్స్!**

ఇక్కడ ప్రెగ్నెన్సీ 31 వారాలకు చేరుకున్న నేపథ్యంలో కోర్టు ఈ కేసులో వైద్యపరమైన అంశాల్ని కూడా పరిశీలించింది. మెడికల్ బోర్డ్ రిపోర్ట్ ప్రకారం అబార్షన్ చేసేందుకు ఆ బాలిక శరీరం వైద్యపరంగా ఫిట్‌గానే ఉందని తెలిసింది. ఈ నివేదికను పరిగణనలోకి తీసుకున్న కోర్టు, బాధితురాలి విజ్ఞప్తిని ఆమోదించింది. సాధారణ పరిస్థితుల్లో గర్భధారణ 20 వారాల వరకు, అత్యాచార బాధితులతో సహా కొన్ని నిర్దిష్ట కేసులకు సంబంధించి 24 వారాల వరకు గర్భ స్రావానికి మెడికల్ టెర్మినేషన్ ఆఫ్ ప్రెగ్నెన్సీ (మీూ) చట్టం అనుమతిస్తుంది. అయితే ఈ కేసులో ప్రెగ్నెన్సీ 31 వారాలకు చేరుకోవడంతో మెడికల్ బోర్డు అభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకొని ప్రత్యేకంగా అనుమతి ఇచ్చింది. 'బాధితురాలు స్వయంగా కౌమార దశలో ఉన్నప్పుడు, ఆమెపై ప్రసవ భారాన్ని లేదా పెంపకం భారాన్ని మోపడం ఏమాత్రం సమర్థనీయం కాదు. రేప్ బాధితురాలైన మైనర్ గర్భాన్ని తొలగించడం కేవలం చట్టపరమైన హక్కు మాత్రమే కాదు, రాజ్యాంగం అందించిన గౌరవప్రదమైన జీవనానికి సంబం ధించిన మానవ హక్కు.' అని జస్టిస్ మినీ పుష్కర్ణ తెలిపారు.

**వైద్య ఖర్చులు ప్రభుత్వమే భరించాలి- పిండాన్ని భద్రపరచాలి!**

బాధితురాలి ఇప్పటికే దిల్లీలోని లేడీ హార్డింగ్ మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్‌లో చేరినట్లు కోర్టుకు తెలియజేశారు. గర్భధారణను ముగించే ప్రక్రియలో భాగంగా, ఆమె పిండ కణజాలాన్ని భద్రపరచాలని హైకోర్టు ఆదేశించింది. అత్యాచారానికి సంబంధించిన క్రిమినల్ కేసులో అవసరమైన డీఎన్ఏ పరీక్షల కోసం ఈ నమూనాలు ఉపయోగపడతాయని తెలిపింది. ఇక్కడ వైద్య ప్రక్రియకు అయ్యే ఖర్చులు అన్నింటినీ రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని కోర్టు స్పష్టం చేసింది. ఒకవేళ అబార్షన్ సమయంలో శిశువు సజీవంగా పుట్టే పరిస్థితి ఏర్పడితే గనుక, ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ శిశువుకు సాధ్యమైనంత వైద్య సహాయం అందేలా చూడాలని కోర్టు ఆదేశించింది. అలాంటి పరిస్థితుల్లో బాలిక, ఆమె కుటుంబం అభిప్రాయం మేరకు- చట్టాలకు అనుగుణంగా శిశువును దత్తతకు ఇచ్చే అవకాశం కల్పించాలని పేర్కొంది. ఇక్కడ బాధితురాలి గుర్తింపును పూర్తిగా రహస్యంగా ఉంచాలని స్పష్టం చేసింది. అత్యాచారం కారణంగా గర్భం దాల్చిన బాలిక తరఫున దాఖలైన పిటిషన్‌పై హైకోర్టు ఈ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రెగ్నెన్సీ కొనసాగించడం వల్ల బాలిక తీవ్ర మానసిక క్షోభకు గురయ్యే ప్రమాదం ఉందని ఆమె, ఆమె తల్లి కోర్టుకు వివరించారు. బాలిక వయస్సు, మెడికల్ బోర్డు రిపోర్ట్, ఆమె మానసిక పరిస్థితి, గౌరవప్రదమైన జీవనం వంటి అంశాల్ని పరిగణనలోకి తీసుకొని గర్భస్రావానికి అనుమతి ఇచ్చింది.

## భారత్ ఫ్రాన్స్ కాదు.. బంగ్లాదేశ్ అంతకన్నా కాదు



భారత్‌లో పాలన మార్పు కోసం కుట్ర జరుగుతోందన్న ఆరోపణలను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండించింది. బంగ్లాదేశ్, ఫ్రాన్స్‌లో చోటుచేసుకున్న పరిణామాలతో భారత్‌లోని నిరసనలను పోల్చడం సరికాదని స్పష్టం చేసింది. దేశంలో ప్రతిపక్షాలు శాంతియుత నిరసనలనే విశ్వసిస్తాయని, ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరిగేలా చూడాలన్నదే తమ ప్రధాన డిమాండ్ అని కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ వెల్లడించారు. ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో పెద్ద సంఖ్యలో ఓటర్ల పేర్లు తొలగించడంపై తమకు అభ్యంతరాలు ఉన్నాయని తెలిపారు. మరోవైపు, భారత్‌లోనూ ఫ్రాన్స్, బంగ్లాదేశ్ తరహా పరిణామాలకు కుట్ర జరిగిందని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు ఆరోపించడంపై ఈ విధంగా స్పందించారు. భారత్‌లో జరుగుతున్న నిరసనలను ఫ్రాన్స్, బంగ్లాదేశ్‌లోని పరిణామాలతో పోల్చడాన్ని శశి థరూర్ తప్పుబట్టారు. భారత్ ఆ రెండు దేశాల్లాంటిది కాదని స్పష్టం చేశారు. ఫ్రాన్స్‌లో జరిగిన హింసాత్మక ఘటనలను తాము ఎట్టి పరిస్థితుల్లోనూ సమర్థించబోమని తెలిపారు. బస్సులు, పోలీస్ స్టేషన్లకు నిప్పు పెట్టడం వంటి చర్యలకు కాంగ్రెస్ మద్దతు ఇవ్వదని పేర్కొన్నారు. ప్రతిపక్షాలు శాంతియుత నిరసనలకే ప్రాధాన్యం ఇస్తాయని చెప్పారు. తాను కూడా అటువంటి నిరసనల్లోనే పాల్గొన్నానని, ప్రజాస్వామ్యబద్ధంగా తమ అభిప్రాయాలను వ్యక్తం చేయడమే ప్రతిపక్షాల ఉద్దేశమని వివరించారు. హింసకు పాల్పడటం, ప్రజా ఆస్తులను ధ్వంసం చేయడం తమ విధానం కాదని స్పష్టం చేశారు.

**'ఎన్నికల్లో పారదర్శకతే లక్ష్యం'**

భారత్‌లో ప్రభుత్వాన్ని కూలదోసేందుకు ప్రతిపక్షాలు ప్రయత్నిస్తున్నాయన్న ఆరోపణలను థరూర్ తోసిపుచ్చారు. 'రెజీమ్ ఛేంజ్' అనే పదాన్ని వక్రీకరించి రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించకూడదని వ్యాఖ్యానించారు. తమ పోరాటం ప్రభుత్వాన్ని అక్రమంగా తొలగించడం కోసం కాదని, ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికలు నిష్పక్షపాతంగా జరిగేలా చూడటమే లక్ష్యమని వివరించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో పెద్ద సంఖ్యలో ఓటర్ల పేర్లు తొలగించడం ఆందోళన కలిగిస్తోందని ఆయన పేర్కొన్నారు. ఓటర్ల జాబితాల సవరణలో అక్రమాలు, అవకతవకలు జరిగాయని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయని తెలిపారు. ఈ ప్రక్రియను సమీక్షించి, అన్యాయంగా తొలగించిన పేర్లను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి పునాది అని, ఓటర్ల జాబితాల తయారీలో పారదర్శకత తప్పనిసరి అని కాంగ్రెస్ అభిప్రాయపడుతోంది. ఈ అంశాన్ని రాజ్యాంగపరమైన సమస్యగా చూడాలని థరూర్ పేర్కొన్నారు. దీనిని ప్రభుత్వాన్ని కూలదోసే ప్రయత్నంగా చిత్రీకరించడం సరికాదని స్పష్టం చేశారు.

**భారత్-యూరప్ పోలిక సరికాదు: పవన్ ఖేడా**

కాంగ్రెస్ రాజ్యసభ సభ్యుడు పవన్ ఖేడా కూడా భారత్‌లోని నిరసనలను యూరప్‌లో జరిగిన ఆందోళనలతో పోల్చడాన్ని తప్పుబట్టారు. భారత్, యూరప్‌లలోని పరిస్థితులను ఒకే గాటన కట్టలేమని వ్యాఖ్యానించారు. యూరప్‌లోని నిరసనలను ముస్లింలకు సంబంధించిన సమస్యగా చిత్రీకరించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. ముస్లింలను హింసాత్మకులుగా, తీవ్రవాదులుగా, అనాగరికులుగా చూపించే కథనాలను ప్రోత్సహించడం ప్రమాదకరమని ఖేరా పేర్కొన్నారు. ఇలాంటి ప్రచారం ద్వారా భారత్‌లోనూ ముస్లింలను లక్ష్యంగా చేసుకునే వాతావరణాన్ని సృష్టిస్తున్నారని విమర్శించారు. భారత్‌లో గతంలో జరిగిన కొన్ని నిరసనల సందర్భంగా మతపరమైన ఉద్రిక్తతలు సృష్టించేందుకు ప్రయత్నాలు జరిగాయని ఆయన ఆరోపించారు. సంఘ్ పరివార్‌కు చెందిన కొందరు వ్యక్తులు ముస్లింల వేషధారణలో కనిపిస్తూ అల్లర్లు రెచ్చగొట్టేందుకు ప్రయత్నించారని పేర్కొన్నారు. బంగ్లాదేశ్‌లో హింసాత్మక ఘటనలు, ఫ్రాన్స్‌లో అల్లర్లు, విధ్వంసం, దోపిడీ చోటుచేసుకున్న తరహాలోనే భారత్‌లోనూ కుట్రకు ప్రయత్నాలు జరిగాయని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు ఆరోపించారు. భారత్‌లో యువతను రెచ్చగొట్టి వీధుల్లో హింసను ప్రేరేపించేందుకు దేశ వ్యతిరేక శక్తులు, కొందరు రాజకీయ నాయకులు కలిసి ప్రయత్నించారని ఆయన పేర్కొన్నారు. అయితే, భారత్‌లో ప్రభుత్వ మార్పు ఎన్నికల ద్వారానే సాధ్యమని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య ప్రక్రియకు విరుద్ధంగా ఇతర మార్గాల్లో అధికార మార్పిడికి ప్రయత్నించడం సాధ్యం కాదని వ్యాఖ్యానించారు. జార్జ్ సోరోస్ పేరును ప్రస్తావిస్తూ కూడా ఆయన విమర్శలు చేశారు.

## ఫ్లైదుబాయ్ ఘటన:
## ప్లంబర్ కథనంపై స్పందించిన భారత పైలట్ స్మిత్ మచ్చర్

తీవ్ర ప్రమాదం నుంచి ఫ్లైదుబాయ్ విమానాన్ని ఓ ప్లంబర్ తన సమయస్ఫూర్తితో కాపాడారంటూ వస్తున్న వార్తలను ఆ విమాన పైలట్ కెప్టెన్ స్మిత్ మచ్చర్ స్పందించారు. ఆ ప్లంబర్ గురించి తనకు కనీస సమాచారం కూడా లేదని ఆయన స్పష్టం చేశారు. ప్రస్తుతం యూఏఈలో చికిత్స పొందుతూ కోలుకుంటున్న పైలట్ స్మిత్, అంతర్జాతీయ మీడియాతో మాట్లాడుతూ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇటీవల ఫ్లైదుబాయ్ విమానంలో ఎమర్జెన్సీ తలెత్తిన సమయంలో, ప్రయాణికుడిగా ఉన్న యానివ్ హయూన్ అనే ప్లంబర్ తన సాహసంతో ప్రమాదాన్ని నివారించినట్లు వార్తలు వచ్చాయి. 'ఎయిర్ క్రాష్ ఇన్వెస్టిగేషన్' అనే టీవీ షోలో చూసిన అంశాలను ఆధారంగా చేసుకుని, కంట్రోల్ స్టిక్స్‌ను వెనక్కి లాగి విమానాన్ని స్థిరపరిచానని హయూన్ గతంలో పేర్కొన్నారు. అనంతరం విధుల్లో లేని మరో పైలట్ సహాయంతో విమానాన్ని సౌదీ అరేబియాలోని తబుక్‌లో సురక్షితంగా ల్యాండ్ చేసినట్లు ఆయన ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుకు వివరించడంతో ఈ అంశం చర్చనీయాంశమైంది. ఈ కథనాలపై కెప్టెన్ స్మిత్ మచ్చర్ స్పందిస్తూ, "నిజం చెప్పాలంటే ఆ ప్లంబర్ ఉదంతం గురించి నాకేమీ తెలియదు. విమానంపై ఆకస్మిక దాడి జరిగినప్పుడు, అది కూలిపోకుండా కాపాడేందుకే నేను సర్వశక్తులు ఒడ్డాను. నన్ను నేను రక్షించుకోవడానికి తీవ్రంగా ప్రయత్నించాను" అని వెల్లడించారు. విమానం కెప్టెన్ నియంత్రణలోనే ఉందంటూ ఓ సీనియర్ అధికారి చెప్పిన మాటలు మాత్రమే తనకు గుర్తున్నాయని ఆయన పేర్కొన్నారు. ఒక ప్లంబర్ విమానాన్ని ల్యాండ్ చేయగలడా అనే ఊహాగానాలపై తాను స్పందించబోనని ఆయన స్పష్టం చేశారు. దాడి జరిగిన తర్వాత చోటుచేసుకున్న పరిణామాలు తనకు పూర్తిగా గుర్తులేవని కెప్టెన్ స్మిత్ వివరించారు. తీవ్రమైన దాడి జరుగుతున్నప్పటికీ, ఎంతో శ్రమించి తన సీట్ బెల్ట్ విప్పుకుని కాక్‌పిట్ తలుపులు తెరిచినట్లు ఆయన గుర్తు చేసుకున్నారు.

## దేశంలోనే అతిపెద్ద గ్యాంగ్‌స్టర్‌ను తమ అల్లుడిగా చేసుకున్నారు

బాలీవుడ్ నటుడు టైగర్ ష్రాఫ్ కారుపై జరిగిన కాల్పుల ఘటనపై ఆమ్‌ఆద్మీ పార్టీ (ఆప్) జాతీయ కన్వీనర్, దిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ స్పందించారు. కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. దేశంలో నేరాలు, భద్రత విషయంలో కేంద్రం వ్యవహరిస్తున్న తీరును ప్రశ్నించారు. నేర కార్యకలాపాలు నిర్వహించడానికి కేంద్రం ఒక గ్యాంగ్‌స్టర్‌కు సౌకర్యాలు కల్పించిందని ఆరోపించారు. బీజేపీ (ఎన్‌డీఏ) సొంతంగా అధికారంలో ఉన్న రాష్ట్రాల్లోనూ శాంతిభద్రతలను కాపాడుకోలేకపోతోందని మండిపడ్డారు. దేశంలోనే అతిపెద్ద గ్యాంగ్‌స్టర్‌ను (లారెన్స్ బిష్ణోయ్) అల్లుడిలా చూసుకుంటూ, దేశంలోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా నేరాలకు పాల్పడటానికి అతడికి అన్ని సౌకర్యాలు కల్పిస్తోందని విమర్శించారు. ఈ మేరకు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. త్వరలో జరగబోయే పంజాబ్ అసెంబ్లీ ఎన్నికల గురించి కూడా ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ వ్యాఖ్యానించారు. అక్కడ కమలం పార్టీకి ఓటు వేయడమంటే పంజాబ్‌లోకి గ్యాంగ్‌స్టర్ (లారెన్స్ బిష్ణోయ్)ను ఆహ్వానించడమేనని హెచ్చరించారు. ఈ విషయం పంజాబ్ ప్రజలకి తెలుసన్నారు. మరికొద్ది రోజుల్లో బీజేపీకి చెందిన వ్యక్తులు శాంతి భద్రతలపై ఉపన్యాసాలు ఇవ్వడానికి పంజాబ్‌కు వస్తారని ఎద్దేవా చేశారు.

**కాల్పులకు పాల్పడినవారిని, వారి వెనుకున్నవారిని వదిలిపెట్టం: సీఎం ఫడణవీస్**

నటుడు టైగర్ ష్రాఫ్‌ను లక్ష్యంగా చేసుకుని జరిగిన కాల్పుల ఘటనకు బాధ్యులైన వారిని, వారిని వెనుక నుంచి నడిపిన వ్యక్తులను ముంబయి పోలీసులు పట్టుకుంటారని మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ తెలిపారు. ఇటువంటి చర్యలను ఏమాత్రం సహించేది లేదని స్పష్టం చేశారు. నిందితుల గుర్తింపునకు సంబంధించి పోలీసులకు కీలక ఆధారాలు లభించాయని, త్వరలోనే వారిని అరెస్టు చేస్తారని చెప్పారు. నిందితులు మహారాష్ట్ర వెలుపల నుంచి బహుశా విదేశాల నుంచి కార్యకలాపాలు సాగిస్తున్నారని పేర్కొన్నారు. నిందితులను పట్టుకునేందుకు ఇతర రాష్ట్రాల పోలీసులతో సమన్వయం చేసుకోవడంతో పాటు కేంద్ర దర్యాప్తు సంస్థల సాయం కూడా తీసుకుంటామని అన్నారు.

# శ్రీ కొండలమ్మ అమ్మవారు శ్రీ మహిషాసుర మర్దినీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనము

**గుడివాడ అక్టోబర్ 19(మీ వార్త ప్రతినిధి)** కృష్ణాజిల్లా, గుడ్లవల్లేరు మండలం, వేమవరం గ్రామములో వేంచేసియున్న శ్రీ కొండలమ్మ అమ్మవారి దేవస్థానములో వరకు శ్రీదేవి శరన్నవరాత్రులు మహోత్సవములులో భాగముగా విజయవాడ వారిచే కూచిపూడి వంటి సాంసృతిక కార్యక్రమములు జరిగినవి.

ది.19.10.2026

కృష్ణాజిల్లా, గుడ్లవల్లేరు మండలం, వేమవరం గ్రామములో వేంచేసియున్న శ్రీ కొండలమ్మ అమ్మవారి దేవస్థానములో వరకు శ్రీదేవి శరన్నవరాత్రులు మహోత్సవములులో భాగముగా ఈరోజు ఆశ్వయుజ శుద్ధ నవమి సందర్భముగా శ్రీ కొండలమ్మ అమ్మవారు శ్రీ మహిషాసుర మర్దినీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనము ఇవ్వటం జరిగినది. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేయగా దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఆకుల కొండలరావు, దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ శ్రీ ఈడే వెంకట విష్ణు మోహన్ రావు గారు, సభ్యులు, శ్రీమతి తూము రాజ్యలక్ష్మి, శ్రీమతి గుడ్లవల్లేటి వాణి, శ్రీ కళ్ళేపల్లి సుగుణ శేఖర్, శ్రీ వడ్లమూడి రవీంద్రబాబు శ్రీ మన్నెం వీర నాగేంద్రరావు, శ్రీ ముంగం ఆంజనేయులు, శ్రీమతి నూతలపాటి లక్ష్మి పావని, శ్రీమతి పెద్దిబోయిన శ్యామల దేవి, శ్రీమతి ఉస్తేల కోటేశ్వరమ్మ, శ్రీ పెన్నేరు వీర వెంకట నాగ లీల శేఖర్, దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఆకుల కొండలరావు మరియు దేవస్థాన ముఖ్య అర్చక శ్రీ ఆర్.ఎస్.సి.ఎస్.సంతోష్ శర్మగారు శ్రీ అమ్మవారి దేవస్థానంలో ఏర్పాట్లను పరివేక్షించినారు. కుంకుమ పూజ మరియు హోమములో పాల్గొనినారు. తొలుత సహస్రనామార్చన అనంతరం సమస్త నరఘోష నివారణకు,శత్రుఘోష నివారణ శ్రీ ప్రత్యంగిర, శ్రీ బాగళా హవనములు అనంతరం నీరాజన మంత్రపుష్పములు తీర్ధ ప్రసాదములు అందజేసినారు. శ్రీ అమ్మవారి దేవస్థానమునకు ఈరోజు ఉచిత ప్రసాదం నిర్వహించిన దాతలు శ్రీ వెనిగళ్ళ రామకృష్ణ, లక్ష్మి ప్రసన్న దంపతులు చి×× బాంధవి, చి×× పృథ్వి మరియు శ్రీ వెనిగళ్ళ మదన్ కిషోర్ తిరుమల, దీప్షిత చౌదరి, చి×× షణ్ముఖ చౌదరి గార్లు.



శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవములు సందర్భముగా విచ్చేయు భక్తులకు ఏవిధమైన అసౌకర్యము కలుగకుండా దేవస్థానము పరిసర ప్రాంతములలో పారిశుధ్య కార్మికులతో బ్లీచింగ్ చల్లించడ మైనది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆయుష్ డిపార్ట్ మెంట్ డా×× గురురాజు ప్రభుత్వ ఉచిత హోమియో వైద్య శిబిరం వారితో ఫ్రీ మెడికల్ క్యాంప్ లు, పోలీస్ డిపార్ట్మెంట్ వారితో ఔట్ పోస్ట్, మెడికల్ ఒ హెల్త్ డిపార్ట్మెంట్ వారితో ఫ్రీ మెడికల్ క్యాంప్ లు మరియు అగ్ని మాపక శాఖ వారు తగు ముందస్తు జాగ్రత్త ఏర్పాటు చేయటమైనది. ఈరోజు సాంస్కృతిక కార్యక్రమములు మధ్యాహ్నం గం..1.00 లకు శ్రీ దుర్గా భవాని భజన సమాజం కొత్తపల్లి వారిచే భజన, మధ్యాహ్నం గం..3.00 లకు శ్రీ వేణుగోపాల భజన సమాజం వారిచే భజన వంటి కార్యక్రమములు జరిగినవి. అనంతరం సాయంత్రం గం×× 5.30 ని××లకు నుండి సాయంకాలార్చన, ఉంజల్ సేవ, పంచహారతులు మంత్ర పుష్పములు, చతుర్వేదస్వస్తి అనంతరం తీర్ధ ప్రసాద వితరణ జరిగినది. రాత్రి 7.30 ని××లకు శ్రీ దత్త సాయి శ్రీ శివాని కూచిపూడి నాట్యాలయం వారిచే కూచిపూడి నృత్య ప్రదర్శన, రాత్రి 8.30 ని××లకు లక్ష్మి లీలా భాగవతారిణి వారిచే హరికథ కాలక్షేపం, రాత్రి 10.00 ని××లకు చల్లపల్లి వారిచే బాలనాగమ్మ పౌరాణిక వంటి సాంస్కృతిక కార్యక్రమములు జరుగునని దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఆకుల కొండల రావు తెలిపియున్నారు.

# రాజోలు మండల జడ్పీటీసీ అభ్యర్థిత్వాన్ని ఆశిస్తున్న కాండ్రేగుల రామకృష్ణ

**రాజోలు అక్టోబర్ 19 ( మీ వార్త విలేఖరి )** తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, పొదలాడ గ్రామ మాజీ సర్పంచ్, మాజీ మార్కెటింగ్ యార్డ్ చైర్మన్, రాజోలు తాలూకా శెట్టిబలిజ సంఘం అధ్యక్షులు శ్రీ కాండ్రేగుల సత్యనారాయణ గారి చిన్న కుమారుడు శ్రీ కాండ్రేగుల రామకృష్ణ తెలుగుదేశం పార్టీ తరఫున రాజోలు మండల జడ్పీటీసీ అభ్యర్థిత్వాన్ని ఆశిస్తున్నారు.
రాజకీయ, సామాజిక సేవా రంగాల్లో విశేష అనుభవం కలిగిన కుటుంబ నేపథ్యం నుంచి వచ్చిన కాండ్రేగుల రామకృష్ణ ప్రజలకు మరింత చేరువగా ఉంటూ, వారి సమస్యలను తెలుసుకొని పరిష్కార దిశగా కృషి చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు.
ప్రజా సేవను బాధ్యతగా భావిస్తూ, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి, యువతకు మెరుగైన అవకాశాలు కల్పించడానికి కృషి చేయాలనే సంకల్పంతో రాజోలు మండల జడ్పీటీసీ అభ్యర్థిత్వాన్ని ఆశిస్తున్నారు.
తన తండ్రి శ్రీ కాండ్రేగుల సత్యనారాయణ ప్రజాజీవితంలో సంపాదించుకున్న అనుభవం, రాజకీయ పరిచయాలు, సామాజిక సేవా నేపథ్యం తనకు స్ఫూర్తిగా నిలుస్తాయని రామకృష్ణ గారు భావిస్తున్నారు. ఆ స్ఫూర్తితో ప్రజల ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తూ, పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేయాలని ఆకాంక్షిస్తున్నారు.
అభివృద్ధే లక్ష్యం -- ప్రజాసేవే ధ్యేయం
రాజోలు మండలంలోని గ్రామాల అభివృద్ధి, మౌలిక సదుపాయాల మెరుగుదల, రహదారులు, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్య, వైద్య సదుపాయాల అభివృద్ధి వంటి ప్రజలకు సంబంధించిన అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలనే దృక్పథంతో ముందుకు సాగాలని ఆయన ఆశిస్తున్నారు.



# టీడీపీలో అసంతృప్తి సెగలు.. చల్లార్చడానికి అధిష్టానం ప్రయత్నాలు

**రాజంపేట :** ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికలలో సీట్ల సర్దుబాటు పై టీడీపీలో అసంతృప్తి వ్యక్తమవుతుంది. మున్సిపల్, జెడ్పీటీసీ, ఎంపీటీసీ సీట్ల సర్దుబాటు వ్యవహారం తెలుగుదేశం పార్టీ లో తీవ్ర అసంతృప్తికి దారితీస్తోంది. కూటమి పార్టీలైన జనసేన, బీజేపీలతో సీట్ల పంపకాలు జరుపుతుండటంతో, క్షేత్రస్థాయిలో ఉన్న టీడీపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొన్ని చోట్ల అయితే తమకు పదవులు రావని భావించి ఎమ్మెల్యేలపై వత్తిడి తెస్తున్నారు. తమకు సంబంధం లేదని, సీట్ల సర్దుబాటు అంతా పార్టీ అగ్ర నాయకత్వమే చూసుకుంటుందని ఎమ్మెల్యేలు నచ్చ చెప్పే ప్రయత్నం చేసినా వినడం లేదు. ప్రధానంగా తూర్పు గోదావరి జిల్లాలో కొన్ని చోట్ల పదవులు ఆశించి తమకు రావని భావించిన నేతలు కిరోసిన్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి ఒడిగడుతున్నారు. ఎమ్మెల్యేలకు ఇది ఇబ్బందికరంగా మారింది. తమకు సంబంధం లేదని చెబుతున్నప్పటికీ స్థానిక నేతలు మాత్రం వినడం లేదు. రాబోయే స్థానిక ఎన్నికల్లో జనరల్ కేటగిరీకి వచ్చే కీలకమైన మేయర్ పీఠాలను, అలాగే ఉమ్మడి గోదావరి జిల్లాల్లోని జెడ్పీ ఛైర్మన్ స్థానాలను జనసేనకు కేటాయించే అవకాశం ఉందనే వార్తలతో స్థానిక టీడీపీ నేతలు రగిలిపోతున్నారు.పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు అండగా నిలిచిన పాత నాయకులను కాదని, కొత్తగా చేరిన వారికి ప్రాధాన్యత ఇస్తున్నారంటూ పలు నియోజకవర్గాల్లో అంతర్గత



విభేదాలు భగ్గుమంటున్నాయి. ఉదాహరణకు రాజంపేట, బద్వేల్, మైలవరం వంటి ప్రాంతాల్లో ఇతర పార్టీల నుంచి వచ్చిన నేతలకు పదవులు ఎలా ఇస్తారని నేతలు నిలదీస్తున్నారు. పార్టీ అధికారంలో లేనప్పుడు తాము జెండా వదలకుండా కష్టపడి, కేసులకు భయపడకుండా పార్టీ కోసం పనిచేసినా తమను పక్కన పెట్టడమేంటని ప్రశ్నిస్తున్నారు. ఇలా అయితే తాము పార్టీకి చేసిన సేవలకు గుర్తింపు ఎలా దక్కుతుందని నేతలను, ఎమ్మెల్యేలను నిలదీస్తున్నారు. ప్రభుత్వ పథకాలు, స్థానిక అభివృద్ధి పనుల విషయంలో టీడీపీ, జనసేన శ్రేణుల మధ్య సోషల్ మీడియా వేదికగా తీవ్రమైన 'క్రెడిట్ వార్' నడుస్తోంది. తమ ప్రాధాన్యత తగ్గిపోతోందని 'టీడీపీ తమ్ముళ్లు' బహిరంగంగానే అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ అంతర్గత అసంతృప్తి పార్టీకి నష్టం చేకూర్చకుండా ఉండేందుకు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు మరియు అధిష్టానం అలర్ట్ అయ్యింది. నియోజకవర్గాల వారీగా వివాదాలున్న నేతలను పిలిపించి మాట్లాడటంతో పాటు, అసంతృప్తితో ఉన్న నేతలను బుజ్జగించేందుకు ప్రత్యేక భేటీలు నిర్వహిస్తున్నారు. నవంబర్ 15 లోగా గ్రామ స్థాయి నుంచి కమిటీల నియామకం పూర్తి చేయాలని, పార్టీ క్రమశిక్షణ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నారు. పదవులు ఇవ్వకుండా తమను ఎన్నాళ్లు వాడుకుంటారంటూ కొందరు సోషల్ మీడియాలో నిలదీస్తున్నారు. కూటమి పొత్తులో భాగంగా సీట్ల సర్దుబాటు పై కొంత రాజీ పడాలని సర్ది చెబుతున్నా నేతలు వినడం లేదట. కొందరయితే తమకు సీటు ఇవ్వకున్నా స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేస్తామని కొందరి నేతల ఆడియో లీకులు పార్టీని షేక్ చేస్తున్నాయి. టీడీపీ లో ఇలా కంట్రోల్ తప్పితే వచ్చే ఎన్నికలలో ఎలా అన్న మధనం ఎమ్మెల్యేల్లోనూ బయలుదేరింది. తమకు పనిచేసిన వారికి పదవులు ఇవ్వకపోతే ఇక తాము ఉన్నది ఎందుకని? కొందరు ఎమ్మెల్యేలను నేరుగా ప్రశ్నిస్తుండటంతో తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేలు సమాధానం చెప్పలేక నోరు వెళ్లబెడుతున్నారని సమాచారం.

## మైదుకూరు పురపాలక ఎన్నిక వాయిదా మళ్లీ నోటిఫికేషన్ ఇస్తాం

-మొదటిపేజీ తరువాయి

మున్సిపల్ ఎన్నికలను వాయిదా వేస్తున్నామని మళ్లీ ఎప్పుడు ఎన్నికలు నిర్వహించేది త్వరలో తదుపరి నోటిఫికేషన్ ఇస్తామని చెప్పారు. నామినేషన్ల ఘట్టంలో ఉద్రిక్తతలు, అల్లర్లపై తమకు వచ్చిన ప్రతి ఫిర్యాదును సంబంధిత అధికారులకు పంపించి వారి నుంచి వివరాలు అడుగుతున్నామని వచ్చిన నివేదికల మేరకు చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. ఎక్కడ ఎవరు అలసత్వం వహించినా తమకు క్షేత్రస్థాయి నుంచి వచ్చిన నివేదికల ఆధారంగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అలానే అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, పోలీసు కమిషనర్లతో ఎన్నికల నిర్వహణపై వీడియో కాన్ఫరెన్స్ ఏర్పాటు చేసి తగిన ఆదేశాలు ఇస్తామని ఎస్ఈసీ తెలిపారు.

**నిబంధనలను ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు**

నామినేషన్ల దాఖలు సందర్భంగా కొన్ని జిల్లాల్లో తలెత్తిన హింసాత్మక ఘటనలు పోలింగ్ రోజున పునరావృతం కాకుండా స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంతంగా, స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు పటిష్ఠ చర్యలు తీసుకునేలా ఎస్ఈసీ అనిల్ చంద్ర పునేఠా అధికారులను ఆదేశించారు. ఇందుకోసం పకడ్బందీగా బందోబస్తు చేపట్టాలని సీఎస్ సాయిప్రసాద్, డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా, శాంతిభద్రతల ఏడీజీ మధుసూదన్‌రెడ్డి, ఐజీ రాజకుమారితో నిర్వహించిన సమీక్షలో ఆదేశించారు.
కొన్ని జిల్లాల్లో తలెత్తిన సమస్యల నేపథ్యంలో రాబోయే ఎన్నికల దశల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకున్నామని సున్నిత, అత్యంత సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీస్ బందోబస్తును పునఃసమీక్షించి అవసరమైన చోట అదనపు బలగాలను ఏర్పాటు చేస్తామని డీజీపీ తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణలో అలసత్వం వహించకుండా

## ?ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్ దసరా శుభాకాంక్షలు.



**?ఏలూరు, అక్టోబర్ 19: విజయదశమి** (దసరా) పండుగ సందర్భంగా ఏలూరు జిల్లా ప్రజలందరికీ ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్ శుభాకాంక్షలు తెలిపారు. దుష్టశక్తులపై దైవశక్తి, అధర్మంపై ధర్మం, చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక దసరా అని చెప్పిన ఎంపీ, ఆ దుర్గామాత దివ్య ఆశీస్సులు ఏలూరు జిల్లా ప్రజలందరితోపాటు, రాష్ట్ర ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. దేవీ నవరాత్రులు సందర్భంగా ఇటీవల తాను ఏలూరులో పలు దేవాలయాల్లో అమ్మవారి సేవలో పాల్గొనడం ఎంతో సంతోషాన్ని కలిగించిందని చెబుతూ, అమ్మవారి కరుణా కటాక్షాలతో ఏలూరు జిల్లా సుభిక్షంగా వర్ధిల్లాలని, ప్రతి ఇంటా ఆనందం వెల్లివిరియాలని కోరుకుంటున్నట్లు పేర్కొన్నారు.

## గాడ్స్ లవ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు పంపిణీ



**రాజోలు అక్టోబర్ 19( మీ వార్త విలేఖరి )** రాజోలు నియోజకవర్గం గాడ్స్ లవ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాజోలు గ్రామానికి చెందిన కందికట్ల రేచర్ల జ్యోతి పుట్టినరోజు సందర్భంగా వారు సమకూర్చిన ఆర్థిక సహాయంతో అంతర్వేదిపాలెం గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన బుడితి ఖల్నాయక్ ,ఎర్రమ్మ దంపతులకు సొంత నివాసం లేకుండా జీవనం సాగిస్తున్నారు.ఆ విషయం తెలుసుకున్న గాడ్స్ లవ్ ఫౌండేషన్ సభ్యులు నిత్యవసర సరుకులు పంపిణీ చేసినట్లు పాస్టర్ గుర్రం రాజు,గెడ్డం.రాజు,దొండపాటి.సునీల్, కె గణేష్ తెలిపారు.ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

## స్థానిక ఎన్నికల్లో కేంద్ర బలగాలు అవసరం లేదు

-మొదటిపేజీ తరువాయి

సింగిల్ జడ్జి, కేంద్ర బలగాల అవసరం లేదంటూ పిటిషన్‌ను తోసిపుచ్చారు. సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ లేళ్ల అప్పిరెడ్డి హైకోర్టు డివిజన్ బెంచ్‌లో అప్పీల్ దాఖలు చేశారు. తాజాగా ఈ అప్పీల్ పిటిషన్‌పై ధర్మాసనం విచారణ చేపట్టింది. విచారణ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపించారు. రాష్ట్రంలోని సున్నితమైన, అతి సున్నితమైన ప్రాంతాలను ఎన్నికల సంఘం ఇప్పటికే గుర్తించిందని కోర్టుకు తెలిపారు. ఆయా సమస్యాత్మక ప్రాంతాల్లో శాంతిభద్రతల పరిరక్షణ కోసం ఎస్ఈసీ తగిన రీతిలో అదనపు పోలీసు బలగాలను సైతం మోహరించిందని స్పష్టం చేశారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. పుంగనూరు, రాయచోటి ఘటనలపై వివరణ : పుంగనూరు, రాయచోటిలలో జరిగిన కొన్ని ఘటనలను సాకుగా చూపిస్తూ కేంద్ర సాయుధ బలగాలను మోహరించాలని పిటిషనర్ కోరడం సమంజసం కాదని ఏజీ వాదించారు. ఆయా ప్రాంతాల్లో ఓ రాజకీయ పార్టీ నేతకు సంబంధించిన కాన్వాయ్‌లోని వాహనం బారికేడ్లను బద్దలు కొట్టుకుంటూ అతివేగంగా దూసుకెళ్లిందన్నారు. నేరుగా నామినేషన్ కేంద్రం ప్రాంగణంలోకి వెళ్లి పలువురికి గాయాలు కావడానికి కారణమైందని తెలిపారు. ఈ ఘటన వల్లే అక్కడ ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయని న్యాయస్థానానికి వివరించారు.
బెంగాల్‌తో పోలిక సరికాదు
బంగాల్‌లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో కేంద్ర సాయుధ బలగాలను మోహరించారని, అదే తరహాలో ఏపీలోనూ కేంద్ర బలగాలను దించాలని పిటిషనర్ కోరడం సరికాదని ఏజీ పేర్కొన్నారు. బెంగాల్‌లో సార్వత్రిక ఎన్నికల అనంతరం విపరీతమైన రాజకీయ హింస చెలరేగిందని, ఆ హింసాకాండలో పలువురు ప్రాణాలు కోల్పోయారని గుర్తుచేశారు. ఆంధ్రప్రదేశ్‌లో అలాంటి హింసాత్మక పరిస్థితులు ఎక్కడా లేవని స్పష్టం చేశారు. ఈ వాస్తవాలన్నింటినీ పరిశీలించిన తర్వాతే గతంలో సింగిల్ జడ్జి సరైన ఉత్తర్వులు ఇచ్చారని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వ వాదనలను పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు డివిజన్ బెంచ్, వైఎస్సార్సీపీ దాఖలు చేసిన అప్పీల్ పిటిషన్‌ను కొట్టివేస్తూ నిర్ణయం తీసుకుంది.

## ప్రభుత్వ ఆస్తుల ధ్వంసం క్షమించరాని నేరం

-మొదటిపేజీ తరువాయి

వసూలు చేయాలని అధికారులను ఆదేశించారు. 'పల్లె పండుగ 3.0' కార్యక్రమంలో భాగంగా వారం రోజుల క్రితమే రూ.4.75 కోట్ల వ్యయంతో ఈ గ్రావెల్ రోడ్డును నిర్మించారు. అయితే, వైసీపీకి చెందిన సుబ్బారెడ్డి అనే వ్యక్తి, వెంకటసుబ్బారెడ్డి అనే మరో వ్యక్తి సహాయంతో ట్రాక్టర్‌తో రోడ్డును దున్ని సుమారు 100 మీటర్ల మేర ధ్వంసం చేశారు. గ్రామస్థులు అందించిన సమాచారంతో అధికారులు ఈ ఘటనపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. సోమవారం ఈ విషయంపై పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఇంజనీరింగ్ ఉన్నతాధికారులతో పవన్ కల్యాణ్ సమీక్ష నిర్వహించారు. ప్రజల సౌకర్యార్థం ప్రజాధనంతో నిర్మించిన ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేయడం క్షమించరాని నేరమని ఆయన అన్నారు. ఈ దుశ్చర్యకు పాల్పడిన వైసీపీ నేత సుబ్బారెడ్డిపై నాన్ బెయిలబుల్ కేసు నమోదు చేసి కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రోడ్డు ధ్వంసం వల్ల కలిగిన నష్టాన్ని అంచనా వేసి, నిందితులపై రెవెన్యూ రికవరీ చట్టాన్ని ప్రయోగించి ఆ మొత్తాన్ని వారి నుంచే రాబట్టాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ దుర్మార్గపు చర్యకు పాల్పడిన వ్యక్తులతో పాటు వారి వెనుక ఉన్న శక్తులను కూడా చట్టం ముందు నిలబెట్టాలని పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు. నిందితులను ఈరోజు సాయంత్రంలోగా అరెస్టు చేసి మేజిస్ట్రేట్ ముందు హాజరుపరుస్తామని అధికారులు ఉప డిప్యూటీ సీఎంకు తెలిపారు. ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగించే వారి వివరాలను ప్రజలందరికీ తెలిసేలా బహిర్గతం చేయాలని కూడా

# సామర్లకోట రామాలయంలో ఘనంగా కుంకుమ పూజ

భక్తిశ్రద్ధలతో పాల్గొన్న భవాని మాల దీక్షాదారులు -- భవానీలకు ప్రసాద వితరణ



**సామర్లకోట, జఅక్టోబర్19 (మీ వార్త ప్రతినిధి)** సామర్లకోట పట్టణంలోని స్థానిక బలుసులపేటలో ఉన్న రామాలయంలో హిందూ ధర్మ పరిరక్షణ వారి ఆధ్వర్యంలో భవాని మాల దీక్షాదారులు ఘనంగా కుంకుమ పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో, ఆధ్యాత్మిక వాతావరణంలో వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, కుంకుమ పూజలో భవాని మాల దీక్షాదారులు భక్తితో పాల్గొన్నారు. అమ్మవారి అనుగ్రహం అందరికీ కలగాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని భక్తులు ప్రార్థించారు. ఆలయ ప్రాంగణం భక్తుల ఆధ్యాత్మిక సందడితో సందడిగా మారింది. కుంకుమ పూజ అనంతరం నేతల హరిబాబు, వెంకటలక్ష్మి దంపతుల చేతుల మీదుగా భవాని మాల దీక్షాదారులకు, భవానీ భక్తులకు ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. భక్తులకు ప్రసాదం పంపిణీ చేయడంతో కార్యక్రమం మరింత ప్రత్యేకతను సంతరించుకుంది. హిందూ ధర్మ పరిరక్షణలో భాగంగా ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించడం, భక్తిభావాన్ని పెంపొందించడం, సంప్రదాయాలను కొనసాగించడం వంటి లక్ష్యాలతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇలాంటి ధార్మిక కార్యక్రమాలు సమాజంలో ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించడంతో పాటు భక్తుల మధ్య ఐక్యతను బలోపేతం చేస్తాయని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భార్గవ్, రవిచంద్ర, శాండీ, సంజయ్, హర్షిత్, విజయ్, గీత, ప్రతి, మౌనికతో పాటు పలువురు భవానీ భక్తులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.
భక్తి, ఆధ్యాత్మికత, ధార్మిక సంప్రదాయాల సమ్మేళనంగా సామర్లకోట బలుసులపేట రామాలయంలో నిర్వహించిన కుంకుమ పూజ కార్యక్రమం భక్తుల మధ్య ఆధ్యాత్మిక ఆనందాన్ని నింపింది.

# టీడీపీ నాయకుడు భద్రయ్య మృతి

సంతాపం వ్యక్తం చేసిన ములిశెట్టి నాగేశ్వరరావు

**కుక్కునూరు, అక్టోబర్ 19(మి వార్తా ప్రతినిధి)** కుక్కునూరు పంచాయతీ పరిధిలోని కోర్లకుంట గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ కార్యకర్త ఊకె. భద్రయ్య రోడ్డు ప్రమాదంలో కన్నుమూయడం పట్ల మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ములిశెట్టి నాగేశ్వరరావు (నాగు) తీవ్ర విచారం వ్యక్తం చేశారు. వేలేరుపాడు మండలం బండ్లబోరు గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో భద్రయ్య మృతి చెందారన్న విషాదకర వార్త తెలుసుకున్న నాగేశ్వరరావు వెంటనే స్పందించి, పోలీసు శాఖకు సమాచారం అందించి, కుటుంబ సభ్యులకు తెలియజేశారు. అనంతరం మృతదేహానికి జంగారెడ్డిగూడెం ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించేలా అవసరమైన చర్యలు చేపట్టారు. ంభద్రయ్య భౌతికకాయాన్ని కోర్లకుంట గ్రామంలోని ఆయన నివాసానికి తీసుకువచ్చిన అనంతరం నాగేశ్వరరావు పూలమాల వేసి, పార్టీ జెండా కప్పి ఘనంగా నివాళులర్పించారు. అంత్యక్రియల కార్యక్రమంలో పాల్గొని పాడే మోసారు. ఈ సందర్భంగా భద్రయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి, వారి దుఃఖంలో పాలుపంచుకుంటూ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. పార్టీ పట్ల అంకితభావంతో పనిచేసిన భద్రయ్య మృతి తెలుగుదేశం పార్టీ కుటుంబానికి తీరని లోటని నాయకులు పేర్కొన్నారు. ఈ విషాద సమయంలో ఆయన కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి చుంచు సత్యనారాయణ, సీనియర్ నాయకులు పిచ్చుక రాజు, రమణరాజు, పులి శ్రీను, సరిహద్దు సత్యనారాయణ, నరేంద్ర రాజుతో పాటు కూటమి పార్టీల నాయకులు పాల్గొని భద్రయ్యకు ఘనంగా నివాళులర్పించారు.



# కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యం:

పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు..



**జీలుగుమిల్లి. (మీ వార్త ప్రతినిధి)** స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి బలాన్ని నిరూపించి, అన్ని స్థానాల్లో విజయ దుందుభి మోగిస్తామని పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అన్నారు. సోమవారం బర్రింకలపాడులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మీడియా సమావేశంలో ఎమ్మెల్యే బాలరాజు మాట్లాడుతూ.. పోలవరం నియోజకవర్గంలో ఎన్డీఏ కూటమి బలంగా ఉందని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాలకు అభ్యర్థుల ఎంపికపై మూడు పార్టీల ముఖ్య నాయకులతో చర్చించినట్లు వెల్లడించారు. ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా కృషి చేసి అన్ని స్థానాల్లో కూటమి అభ్యర్థులను గెలిపించుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సారథ్యంలో రాష్ట్రంతో పాటు పోలవరం నియోజకవర్గం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయంతో గ్రామాల్లో మరింత అభివృద్ధి సాధిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ఇంచార్జ్, ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాస్, కూటమి నాయకులు శీలం వెంకటేశ్వరరావు, జయవరపు శ్రీరామమూర్తి, పిన్నమనేని మధు, నాయుడు రామకృష్ణ గౌడ్, మొగపర్తి సోంబాబు, పారెపల్లి రామారావు, ఉండవల్లి సోమసుందరం, సుంకవల్లి సాయి, ఎంపీటీసీ నాలి శ్రీను. బండారు అనిల్, కొప్పుల శ్రీకాంత్. రమేష్ కూటమి నాయకులు పాల్గొన్నారు..

# పెడన నియోజకవర్గం ప్రజలందరికీ దసరా శుభాకాంక్షలు.!”

జనసేన పార్టీ సమన్వయకర్త లింగం నాగేశ్వరరావు

**పెడన అక్టోబర్ 19(మీ వార్త ప్రతినిధి)**దుష్టశక్తుల పై దైవశక్తి, అధర్మం పై ధర్మం, చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా రేపు జరుపుకోనున్న దసరా పండుగ సందర్భంగా పెడన నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త లింగం నాగేశ్వరరావు శుభాకాంక్షలు తెలిపారు. విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మ దివ్య ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఈ మేరకు ఆకాంక్షించారు. అమ్మవారి కరుణా కటాక్షాలతో ఆంధ్రప్రదేశ్ సుభిక్షంగా వర్ధిల్లాలని, ప్రతి ఇంటా ఆనందం వెల్లివిరియాలని కోరుకుంటున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా రాష్ట్రవ్యాప్తంగా జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి పార్టీలైన జనసేన, తెలుగుదేశం మరియు బిజెపి బలపరిచిన అభ్యర్థులందరినీ గెలిపించాలని ఈ సందర్భంగా లింగం నాగేశ్వరరావు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రంలో అభివృద్ధి పనులు పరుగులు పెడుతున్నాయని, అదేవిధంగా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నేతృత్వంలో గ్రామాల్లో అభివృద్ధి వేగంగా జరుగుతూ, ఎక్కడ చూసినా పండుగ వాతావరణం కనబడుతుందని, ఈ దసరా మహోత్సవం మరింత శోభాయమానంగా మారుతుందని లింగం నాగేశ్వరరావు వివరించారు. కూటమి ప్రభుత్వంలో రాష్ట్ర ప్రజలందరూ సంతోషాలతో ఉన్నారని, స్థానిక సంస్థల ఎన్నికల్లో మరోసారి తమ ఓటు ద్వారా ఈ విషయాన్ని స్పష్టం చేయనున్నారని లింగం నాగేశ్వరరావు ఆశాభావం వ్యక్తం చేశారు.



# పార్టీ బలోపేతమే లక్ష్యంగా పనిచేద్దాం

**పుల్లలచెరువు అక్టోబర్ 19 ( మీ వార్త )** పార్టీ బలోపేతమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని మండల టిడిపి కన్వీనర్ పోట్ల గోవిందు అన్నారు. మండల కేంద్రమైన పులలచెరువులో సోమవారం నాడు మండల టీడీపీ కార్యకర్తల సమావేశం నిర్వహించడం జరిగింది.
ఈ సందర్భంగా త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎంపీటీసీ ఎన్నికలకు సంబంధించి మండల పార్టీ అధ్యక్షులు పోట్ల గోవిందు పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. మండలంలోని 15 ఎంపీటీసీ స్థానాల్లో గ్రామాల వారీగా నిర్ణయించిన రిజర్వేషన్లకు అనుగుణంగా అవసరమైన సర్టిఫికెట్లు, నామినేషన్ పత్రాలను జాగ్రత్తగా సిద్ధం చేసుకుని, పార్టీ శ్రేణులతో సమన్వయంతో పనిచేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు, క్లస్టర్ ఇన్‌చార్జి కాకర్ల కోటయ్య, మండల పార్టీ మాజీ కన్వీనర్ పయ్యావుల ప్రసాదరావు, శనగా నారాయణరెడ్డి, మండల సీనియర్ నాయకులు రెంటపల్లి సుబ్బారెడ్డి, ప్రధాన కార్యదర్శి శనగా వెంకటేశ్వరరెడ్డి, గజ్వల్లి భాస్కర్, ముటుకుల సొసైటీ చైర్మన్ పావులూరి యోగయ్య , పుల్లలచెరువు సొసైటీ చైర్మన్ నారు వెంకట్రామిరెడ్డి , మేడికొండ లక్ష్మణ్, మండల బీజేపీ అధ్యక్షులు నక్కా యోగేశ్వరరావు, పల్లపాటి బదరయ్య, మండల జనసేన పార్టీ అధ్యక్షులు కొటారు అచ్చయ్య , కూటమి నాయకులు మరియు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# ఖమ్మం పోలీస్ కమిషనర్ కు దసరా శుభాకాంక్షలు తెలిపిన నారపోగు వెంకటేశ్వర్లు..



**తల్లాడ మీ వార్త ప్రతినిధి. 19.10.2026** ఖమ్మం జిల్లా పోలీస్ కమిషనర్ సునీల్ దత్ కు తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర ఎస్సీ విభాగం వైస్ చైర్మన్, జిల్లా వాసి నారపోగు వెంకటేశ్వర్లు శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం ఖమ్మం సీపీ కార్యాలయంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి ప్రత్యేక దసరా శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణలో సేవలందిస్తున్న సీపీని మర్యాదపూర్వకంగా కలిసినట్లు వెల్లడించారు. అనంతరం ఇరువురు కొద్దిసేపు చర్చించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట తీగల నాగరాజు ఉన్నారు.

# మున్సిపాలిటీ ఎన్నికల నామినేసన్ల పరిశీలన




**జంగారెడ్డిగూడెం, అక్టోబర్ 19 ( మీ వార్త ప్రతినిధి )** పట్టణ మున్సిపాలిటీ స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల పరిశీలన (స్క్రూటినీ) ప్రక్రియ సోమవారం ప్రారంభమైంది. మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన స్క్రూటినీ కేంద్రం వద్ద అధికారులు అభ్యర్థుల జాబితాను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరమే లోపలికి అనుమతిస్తున్నారు. నామినేషన్ పత్రాల్లో లోపాలు, తప్పులు లేకుండా నిబంధనల ప్రకారం పరిశీలన చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో స్క్రూటినీ కేంద్రం వద్ద ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేశారు. జంగారెడ్డిగూడెం, చింతలపూడి సీఐ లు స్వయంగా భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. నామినేషన్ల పరిశీలన ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో సాగేలా పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు.

# తాడేపల్లిగూడెం రాజకీయాల్లో పాలూరి మార్క్....!

చైర్మన్ రేసులో పాలూరి వెంకటేశ్వరరావు



**తాడేపల్లిగూడెం అక్టోబర్ 19 (మీ వార్త ప్రతినిధి)** తాడేపల్లిగూడెం రాజకీయాల్లో పాలూరి మార్క్ రెండున్నర దశాబ్దాలుగా సాగుతోంది. 1988లో దర్శిపర్రు సొసైటీ డైరెక్టర్ గా పోటీ చేసి రాజకీయ అరంగేట్రం చేసిన పాలూరి వెంకటేశ్వరరావు తరువాత ఎర్ర నారాయణ స్వామి ఆశీస్సులతో 2000 సంవత్సరంలో తొలిసారి కౌన్సిలర్గా ఎన్నికయ్యారు. తొలిసారి కౌన్సిలర్ గా ఎన్నికైన నాటి నుంచి తన సొంత ప్రాంతమైన జువ్వలపాలెంలో విద్యాభివృద్ధికి విశేషంగా కృషి చేశారు. ఆయన 9 సెంట్లు స్థలాన్ని ఉన్నత పాఠశాల ఏర్పాటుకు విరాళంగా ఇచ్చి ఆ ప్రాంత విద్యాభివృద్ధికి దోహదపడ్డారు. తన తండ్రి పేరుతో పాలూరి సోమాల పురపాలక ఉన్నత పాఠశాల నేటికీ విద్యార్థులకు సేవలందిస్తోంది. వాటితో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలు చేస్తూ జువ్వలపాలెంలో తిరుగులేని నాయకుడిగా ఎదిగారు. మూడు పర్యాయాలు పాలూరి కుటుంబం నుంచే కౌన్సిలర్ గా పని చేయగా రెండు సార్లు ఎన్నికల్లో పాలూరి మద్దతుతో కౌన్సిలర్లు గెలుపొందారు. పాలూరి వెంకటేశ్వరరావు తొలిత యూత్ కాంగ్రెస్ నాయకుడిగా తరువాత టిడిపి నాయకుడిగా తదనంతరం ఈలి నానితో ప్రజారాజ్యం పార్టీలో కొనసాగారు. గత వైసిపి ప్రభుత్వం లో జనసేన పార్టీ తీర్థం పుచ్చుకొని రెండున్నర ఏళ్ళు జనసేన పార్టీకి క్రియాశీలకంగా వ్యవహరించారు. పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ వెంట నడిచి ఆయన అభిమాన పాత్రుడిగా పేరు సంపాదించారు. తాజాగా తాడేపల్లిగూడెం మున్సిపాలిటీ జనరల్ అభ్యర్థికి రిజర్వ్ కావడంతో తాడేపల్లిగూడెంలో మున్సిపల్ చైర్మన్ రేస్ లో ఉన్న అభ్యర్థుల్లో ముందు వరుసలో ఉన్నట్టు సమాచారం. ఇటు స్థానికంగా బలంతో పాటు తాడేపల్లిగూడెంలో ముఖ్య నాయకులు అందరికీ ఇష్టుడిగా అజాతశత్రువుగా ఉన్న పాలూరిని జనసేన పార్టీ చైర్మన్ పదవి రేసులో నిలుపుతుందా లేదా అనేది వేచి చూడాల్సి ఉంది.

# జి.మాడుగులలో మల్టీకేర్ ఆసుపత్రి ప్రారంభం

స్థానికంగానే వైద్య సేవలు.. ప్రజలకు అందుబాటులోకి మెరుగైన వైద్యం




**జి.మాడుగుల (మీ వార్త ప్రతినిధి):** మండల కేంద్రంలో సోమవారం మల్టీకేర్ ఆసుపత్రిని ప్రారంభించారు. ఇప్పటివరకు వైద్య పరీక్షలు, స్కానింగ్ తదితర సేవల కోసం పాడేరు, అనకాపల్లి, నర్సీపట్నం, విశాఖపట్నం వంటి దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేది. స్థానికంగా మల్టీకేర్ ఆసుపత్రి అందుబాటులోకి రావడంతో మండల ప్రజలకు వైద్య సేవలు చేరువయ్యాయి. ఆసుపత్రిని ప్రారంభించిన ఎండీ పి.బంగారు నాయుడు, వరలక్ష్మి దంపతులు మాట్లాడుతూ.. ప్రారంభోత్సవం సందర్భంగా 100 మందికి వైద్యుల కన్సల్టేషన్ ఉచితంగా నిర్వహించినట్లు తెలిపారు. స్థానిక ప్రజలకు అందుబాటులో వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ఆసుపత్రిని ప్రారంభించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కొర్ర అప్పారావు, మహాలక్ష్మి దంపతులతో పాటు స్థానిక పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# మంత్రిపాలెంలో భక్తిశ్రద్ధలతో రుద్రార్చన -- సింధూరార్చన

విశ్వ హిందూ పరిషత్ -- కృష్ణా జిల్లా



**మంత్రి పాలెం అక్టోబర్ 19(మీ వార్త ప్రతినిధి)**
మహిళల భాగస్వామ్యంతో ధార్మిక చైతన్యం -- సామాజిక సమరసతకు ప్రాధాన్యం
మంత్రిపాలెం, అక్టోబర్ 19: మొవ్వ మండలం మంత్రిపాలెం గ్రామంలో సోమవారం ఉదయం 10 గంటలకు విశ్వ హిందూ పరిషత్ -- కృష్ణా జిల్లా సహకారంతో రుద్రార్చన, సింధూరార్చన కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 45 మంది మహిళలు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులతో పాటు గుడూరు ప్రఖండ అధ్యక్షులు శ్రీ తురగా బాబు పాల్గొని కార్యక్రమానికి సహకరించారు.ఈ సందర్భంగా విశ్వ హిందూ పరిషత్ కృష్ణా జిల్లా అధ్యక్షులు డా. బూరగడ్డ శ్రీనాథ్ మాట్లాడుతూ, గ్రామగ్రామాన ధార్మిక కార్యక్రమాల నిర్వహణ ద్వారా భక్తిభావాన్ని పెంపొందించడంతో పాటు, హిందూ సమాజంలో ఐక్యత, సోదరభావం, సామాజిక సమరసతను బలోపేతం చేయడమే పరిషత్ లక్ష్యమని తెలిపారు. మహిళల భాగస్వామ్యంతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాలు ధర్మభక్తి, దేశభక్తి భావాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు దోహదపడుతున్నాయని పేర్కొన్నారు. జిల్లా ప్రభారి పీవీఎస్ నాయుడు మార్గదర్శకత్వంలో జిల్లావ్యాప్తంగా ఇటువంటి కార్యక్రమాలను విస్తరిస్తూ, వందేమాతరం స్ఫూర్తితో "సర్వే జనాః సుఖినో భవంతు" అనే లోకకల్యాణ సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తున్నామని వివరించారు.కార్యక్రమాన్ని విజయవంతం చేసిన మహిళలకు, ఆలయ కమిటీ సభ్యులకు, నిర్వాహకులకు డా. బూరగడ్డ శ్రీనాథ్ కృతజ్ఞతలు తెలిపారు.
పత్రికా ప్రకటన విడుదల చేసినవారు:జొన్నలగడ్డ సుబ్రహ్మణ్యం
కార్యాలయ కార్యదర్శి
విశ్వ హిందూ పరిషత్ -- కృష్ణా జిల్లా

# కొండ్రువీధి లో కనకదుర్గ అమ్మవారిని దర్శించుకున్న





ఏపీ క్రీడా ప్రాధికార సంస్థ డైరెక్టర్ కొవ్వాసు జగదీశ్వరి

**పోలవరం మీ వార్త అక్టోబర్ 19**పోలవరం మండలం గూటాల పంచాయతీ గ్రామ ప్రజల ఆహ్వానం మేరకు ఏపీ క్రీడా ప్రాధికార సంస్థ డైరెక్టర్, పోలవరం నియోజకవర్గం టీడీపీ నాయకురాలు కొవ్వాసు జగదీశ్వరి నేడు ఒబ్బిలి శెట్టి ప్రసాద్ ఆధ్వర్యంలో కొండ్రు వీధి రామాలయంలోవున్నా కనకదుర్గ అమ్మవారిని దర్శించుకున్నారు.ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తిశ్రద్ధలతో అమ్మవారి ఆశీర్వాదాలు తీసుకున్నారు. గ్రామ ప్రజల ఆహ్వానం మేరకు ఆలయానికి విచ్చేసిన కొవ్వాసు జగదీశ్వరికి స్థానికులు సాదర స్వాగతం పలికారు. ఆలయానికి చేరుకున్న ఆమె ముందుగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. గ్రామ ప్రజలతో కలిసి ఆధ్యాత్మిక వాతావరణంలో అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా అమ్మవారి కృపతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, గ్రామంలో ప్రజలందరికీ మంచి జరగాలని ఆకాంక్షించారు. గ్రామ ప్రజల ఆహ్వానం మేరకు ఆలయాన్ని సందర్శించడం ఆనందంగా ఉందని ఆమె పేర్కొన్నారు. గ్రామాల్లో ఆధ్యాత్మిక సంప్రదాయాలను, దేవాలయాల ప్రాముఖ్యతను కాపాడుకోవడం ఎంతో ముఖ్యమని ఈ సందర్భంగా స్థానికులు అభిప్రాయపడ్డారు. కొండ్రు వీధి అమ్మవారి దర్శనం, ప్రత్యేక పూజలతో ఈ కార్యక్రమం భక్తిపూర్వకంగా సాగింది. ఈ కార్యక్రమంలో ఒబ్బిలి శెట్టి ప్రసాద్, కరిబండి. వెంకన్న బాబు బాపులు మారుతి నాగరాజు,గూటాల పంచాయతీ గ్రామ ప్రజలు, స్థానికులు పాల్గొన్నారు.

# ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలపై సమీక్ష





ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై పార్టీల ప్రతినిధులకు అవగాహన

**పోలవరం మీ వార్త అక్టోబర్ 19** పోలవరం మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నిర్వహణపై ప్రత్యేక అధికారి, రిటర్నింగ్ అధికారి కె. ప్రసన్న రవికుమార్ ఆధ్వర్యంలో సోమవారం సమావేశం నిర్వహించారు. మండలంలోని అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై అవగాహన కల్పించారు. ఎన్నికల నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఎన్నికల నిర్వహణకు చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. రూట్ అధికారులు, జోనల్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎఫ్ఎస్టీ, ఎస్ఎస్టీ బృందాల విధులపై సమీక్షించారు. ఎన్నికల సమయంలో నిబంధనల ఉల్లంఘన జరగకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎన్నికల నిర్వహణలో అధికారుల బాధ్యతలను వివరించారు. ఎన్నికలు నిష్పక్షపాతంగా, ప్రశాంతంగా జరిగేలా సమన్వయంతో పనిచేయాలని అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్ మరియు ఎంపీడీవో జి మణికుమారి అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీస్ మరియు తహసిల్దార్ సాయిరాజు, డిప్యూటీ తాసిల్దార్ కంభంపాటి శ్రీనివాసరావు, ఏవో కె రాంబాబు, ఏపిఎం అచ్చియమ్మ, ఏపీవో వెంకటేశ్వరరావు,ఎస్ ఐ పి అప్పరావు ఆర్డబ్ల్యుసిఏఈ గంగరాజు, డిప్యూటీ ఎంపీడీవోలు రవికుమార్, విజయ కుమారి, హౌసింగ్ ఏఈ ఇంచార్జ్ రాజ్ కుమార్ కూటమి నాయకులు వైఎస్ఆర్సిపి నాయకులు, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వాహణకు చర్యలు



**పాయకరావుపేట, మీ వార్త ప్రతినిధి,అక్టోబరు 19 :** మండలంలో స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని మండల స్పెషల్ ఆఫీసర్ కె శ్రీరాములు తెలిపారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ఎన్నికల సమన్వయ సమావేశంలో శ్రీరాములు మాట్లాడుతూ... స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పూర్తి పారదర్శకంగా నిర్వహించేందుకు వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాలు, ప్రవర్తనా నియమావళిని తప్పనిసరిగా పాటించాలన్నారు. రెవెన్యూ, పోలీస్, పంచాయతీ రాజ్, గ్రామ సచివాలయ సిబ్బంది పరస్పర సమన్వయంతో విధులు నిర్వహించాలన్నారు. ఓటర్లను ప్రలోభపెట్టడం, నగదు లేదా బహుమతుల పంపిణీ చేయడం వంటి ఎన్నికల నిబంధనల ఉల్లంఘనలను అరికట్టేందుకు నిత్యం అప్రమత్తంగా ఉండాలని, ఓటర్లు ఎటువంటి భయం, ఒత్తిడి లేదా ప్రలోభాలకు లోనుకాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా అవగాహన కల్పించాలని చెప్పారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి, పోలీస్ శాఖతో సమన్వయం చేసుకుంటూ అవసరమైన ముందస్తు చర్యలు తీసుకోవాలనీ ఎన్నికలకు సంబంధించిన ఉల్లంఘనలు, వివాదాలు లేదా శాంతిభద్రతల సమస్యలు తలెత్తినప్పుడు వెంటనే సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే ప్రతి అధికారి, సిబ్బంది ఎటువంటి పక్షపాతం లేకుండా, బాధ్యతాయుతంగా ఎన్నికల మార్గదర్శకాలకు అనుగుణంగా విధులు నిర్వహించాలని తెలిపారు. ఈ సమావేశంలో తహసీల్దారు ఎస్ఎ మహేశ్వరరావు, ఎంపిడిఓ బి శరత్ బాబు, సిఐ ఎం వినోద్ బాబు, ఎస్ఐ జె పురుషోత్తం, డిప్యూటీ ఎంపిడిఒలు వై వి సత్యనారాయణ, ఎస్ జీవన లత, వీఆర్వోలు, సచివాలయ మహిళా పోలీసులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల ఆశావహుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న-- ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ



**పి. గన్నవరం అక్టోబర్ 19( మీ వార్త విలేఖరి)** ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పి. గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు, జనసేన పార్టీ అమలాపురం పార్లమెంట్ సమన్వయకర్త శ్రీ గిడ్డి సత్యనారాయణ స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన పార్టీ తరఫున ఎంపీటీసీ, జడ్పీటీసీ, ఎంపీపీ పదవులకు పోటీ చేయాలనుకునే ఆశావహుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు.త్వరలోనే కూటమి నాయకులతో సమావేశం నిర్వహించి, సీట్ల సర్దుబాటుపై చర్చించిన అనంతరం ఏ స్థానంలో ఎవరు పోటీ చేయాలనే అంశంపై నిర్ణయం తీసుకుని అభ్యర్థిత్వాలను ఖరారు చేయడం జరుగుతుందని ఎమ్మెల్యే తెలిపారు.కూటమి ధర్మాన్ని పాటిస్తూ, నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ముందుకు సాగాలని, కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషి చేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.

# యువతకు ఆదర్శంగా నిలుస్తున్న యువ నాయకుడు లకే రామకృష్ణ

సొలబం పంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా లకే కృష్ణకుమారి



**జి మాడుగుల (మీ వార్త ప్రతినిధి):**యువతను చెడు వ్యసనాలకు దూరంగా ఉంచి క్రీడల వైపు ప్రోత్సహించడమే సరైన మార్గమని, యువతకు ఆదర్శంగా నిలుస్తూ గ్రామ అభివృద్ధిలో తన వంతు కృషి చేస్తానని లకే రామకృష్ణ పేర్కొన్నారు. జిమాడుగుల మండలం సొలబం పంచాయితీ లో సోమవారం పర్యటించిన ఆయన యువతకు వాలీబాల్ కిట్లు పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతను క్రీడల వైపు ప్రోత్సహించడంతో చెడు వ్యసనాలకు దూరంగా ఉంచగలుగుతామని తెలిపారు . అనంతరం గ్రామస్తులతో మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సొలబం పంచాయతీకి లేడీ ఎస్టీ రిజర్వేషన్ రావడంతో, తన సతీమణి లకే కృష్ణ కుమారి నీ సర్పంచ్ అభ్యర్థిగా పోటీలో ఉంటారని, గ్రామ పంచాయతీ అభివృద్ధికి తాము ఎల్లప్పుడూ ముందుంటామని ఆయన హామీ ఇచ్చారు. పంచాయతీలో నెలకొన్న సమస్యలను పై దృష్టి సారించి సొలబం పంచాయితీని ఆదర్శ పంచాయతీగా నిలబెడతామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా పంచాయతీ ప్రజలందరూ తమ మద్దతు తెలియజేసి కృష్ణ కుమారిని అత్యధిక మెజారిటీతో గెలిపిస్తారని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ సర్పంచ్ పలాసి కొత్తం నాయుడు, సొలబం పంచాయతీ యూత్ లీడర్ కమ్మరి బన్నీ, ఐసారం కొండబాబు, ఐసారం కృష్ణమూర్తి, సొలబం సింహాచలం నాయుడు, పలాసీ బొంజి బాబు నాయుడు, వనుగు లక్ష్మణ్ దొర, టీడీపీ సీనియర్ నాయకులు ఐసరం సింహాద్రి, టీడీపీ యువ నాయకులు మాదుల బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.ం

# గోపాలపురంలో దసరా సందర్భంగా వాలీబాల్ టోర్నమెంట్..



**జీలుగుమిల్లి. (మీ వార్త ప్రతినిధి)** మండలంలోని రాచన్నగూడెం పంచాయతీ గోపాలపురం గ్రామంలో దసరా సందర్భంగా యువత చెడు వ్యసనాల బారిన పడకుండా క్రీడా పోటీలు నిర్వహిస్తున్నారు. లంకలపల్లి మరియు గోపాలపురం యూత్ వాలీబాల్ టోర్నమెంట్ ను సోమవారం ప్రారంభించారు. ఈ వాలీబాల్ టోర్నమెంట్లో గెలుపొందిన క్రీడాకారులకు నగదు బహుమతి అందజేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పి రామకృష్ణ. కే ప్రసాద్. టి నాగరాజు. కె ప్రేమ్. కే గణేష్. కే విజయ్. కే చరణ్. కే బాబురావు. కే సాగర్. ఎం ప్రకాష్. మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# నారాయణపురం ముత్యాలమ్మ ఆలయ వద్ద మహా అన్నదానం..



**తల్లాడ మీ వార్త ప్రతినిధి.19.10.2026**
ప్రారంభించిన ఆలయ నిర్వాహకులు వెదురు కృష్ణారెడ్డి..
తల్లాడ పట్టణంలోని వైరా రోడ్డులోని నారాయణపురం గ్రామంలో శ్రీ ముత్యాలమ్మ దేవాలయం వద్ద సోమవారం మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. దసరా పర్వదినం సందర్భంగా దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ముగింపును పురస్కరించుకొని ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ అన్నదాన కార్యక్రమాన్ని ఆలయ నిర్వాహకులు వెదురు కృష్ణారెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత తొమ్మిది రోజులుగా అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. ముగింపు సందర్భంగా ప్రజలకు ఈ మహా అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. అమ్మవారి దయవల్ల ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, పాడిపంటలతో ఉండాలని ఆకాంక్షించారు. సహకరించిన ప్రతి ఒక్కరికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముత్యాలమ్మ భక్త బృందం మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఎంఈఓ ఎఫ్ఏసీలుగా ఉన్న స్కూల్ అసిస్టెంట్లను వెంటనే వెనక్కి పంపాలి

ఎంఈఓ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డా టీవీ రామకృష్ణ

**ఏలూరు, అక్టోబర్ 19 (మీ వార్త ప్రతినిధి)** రాష్ట్రంలో ఎంఈఓ-1, ఎంఈఓ-2 పోస్టులన్నీ ఒకే కేడర్‌కు సంబంధించినవి అయినప్పటికీ, గత ప్రభుత్వం వీటి మధ్య విభేదాలు ఉండేటట్లు ఉత్తర్వులు ఇచ్చి విద్యావ్యవస్థలో పరిపాలనను అస్తవ్యస్తంగా మార్చిందని ఎంఈఓ-2 సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ టీవీ రామకృష్ణ ఒక ప్రకటనలో విమర్శించారు. దీన్ని అవకాశంగా తీసుకుని ప్రభుత్వ ఉపాధ్యాయుల సంఘం పేరుతో ఉన్న జీటీఏ తమ ఆర్థిక బలాన్ని, అధికారులతో ఉన్న సత్సంబంధాలను ఉపయోగించుకుని నూతన సమస్యలు సృష్టించడానికి చూస్తోందని ఆరోపించారు.ఏలూరు జిల్లాలో రెండు మండలాలకు ఎంఈఓ-1 పోస్టులో పనిచేస్తున్న పంచాయతీరాజ్ ఎంఈఓ-1 ను ఎఫ్ఏసీలుగా నియమించినప్పుడు ఒక ఎంఈఓ ఖాళీ అయితే, ఆ మండలంలో మరో ఎంఈఓకి ఎఫ్ఏసీ బాధ్యతలు ఇవ్వాల్సి ఉండగా, నాన్ గెజిటెడ్ స్కూల్ అసిస్టెంట్లను ఎఫ్ఏసీలుగా పెట్టడం వల్ల గెజిటెడ్ అయిన ఎంఈఓల ఆత్మగౌరవానికి, ఆత్మాభిమానానికి ఇబ్బంది కలుగుతుందన్నారు. 2025 సర్వీస్ రూల్స్ 190, 201, 202 జీవోల ప్రకారం ఎంఈఓలు, హైస్కూల్ హెడ్ మాస్టర్లు అందరూ జోనల్ కేడర్‌కు చెందుతారని, కావున ఎంఈఓ-1 లో పనిచేస్తున్నా, ఎంఈఓ-2 లో పనిచేస్తున్నా అందరూ సమానమే కాబట్టి మండలంలో ఖాళీ అయిన ఎంఈఓ పోస్టుకు అక్కడ ఉన్న రెండో ఎంఈఓకి ఎఫ్ఏసీ బాధ్యతలు అప్పగించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.రాష్ట్రంలో ప్రస్తుతం ప్రభుత్వ ఉపాధ్యాయులే లేకుంటే, ప్రభుత్వ ఉపాధ్యాయుని పేరుతో స్కూల్ అసిస్టెంట్లను ఎంఈఓలుగా ఎఫ్ఏసీగా ఎలా నియమిస్తారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గత మూడు సంవత్సరాల నుంచి ఇద్దరు ఎంఈఓలకు సమాన అధికారాలు ఉండేటట్లు జాబ్ చార్ట్ సవరించాలని విజ్ఞప్తి చేస్తున్నా అధికారులు పరిష్కారం చూపడం లేదని తెలిపారు. కనీసం ఎంఈఓ-2 సెలవులు పెడితే ఆ సెలవు డీవైఈఓ లాగిన్‌కి వెళ్లాల్సి ఉండగా ఎంఆర్‌సీకి వెళుతుందని, ఇది చాలా అభ్యంతరకరమని, వెంటనే డీవైఈఓ లాగిన్‌కి వెళ్లేటట్లు సాఫ్ట్‌వేర్‌ను సరి చేయాలని విజ్ఞప్తి చేశారు.ఇద్దరు ఎంఈఓలను ఒకరు అడ్మినిస్ట్రేషన్ గాను, ఒకరు సర్వీసెస్ గాను జాబ్ చార్ట్ ఇవ్వాలని కోరారు. ఒకరు సర్వీస్ రిజిస్టర్ మెయింటైన్ చేస్తే ఒకరు డీడీఓగా చెల్లింపులు చేస్తారని, ఇది ఇప్పటికే జరుగుతున్న వ్యవహారమని తెలిపారు. ఎంఈఓ-2 ల సర్వీస్ రిజిస్టర్, లీవులు, ఇంక్రిమెంట్లు డీవైఈఓ నిర్వహిస్తుంటే, డీఈఓ ఆఫీస్‌లో ఏడీలు డీడీవోలుగా ఉండి జీతభత్యాలు చెల్లిస్తున్నారని, ఇదే విధానాన్ని ఎంఈఓలు ఇద్దరికీ అమలుపరచాలని విజ్ఞప్తి చేశారు. ఎంఈఓ-2 లకు ఎండీఎం డైరెక్టర్ వారి నుండి ర్యాండమైజ్డ్ మెసేజ్‌ల ద్వారా ప్రతిరోజు ఒక స్కూలు ఎండీఎం, టీఎంఎఫ్ ఇన్స్‌పెక్షన్ చేసి ఆన్‌లైన్‌లో ఉంచాలని మెసేజ్‌లు వస్తున్నాయని, వాటి వల్ల మిగిలిన కార్యక్రమాలను సమన్వయం చేసుకోవడానికి ఇబ్బంది కలుగుతుందని, ఎప్పటిలా ప్రతిరోజు రెండు పాఠశాలలు సందర్శించి ఇన్స్‌పెక్ట్ చేయాలని ఉత్తర్వులు అమలు



చేయాలని కోరారు. అలాగే ఎంఈఓ-2 లు నెలలో ఎన్ని వర్కింగ్ డేస్ ఉంటే అన్ని రోజులు టూర్ చేయాల్సిన పరిస్థితి ఉందని, ఎంఈఓ-1 లు మాత్రం నెలలో 15 రోజులు టూర్ చేస్తే చాలని, ఈ తేడాను సవరించాలని, ఇద్దరికీ సమానమైన పనిభారం ఉండేటట్లు చూడాలని విజ్ఞప్తి చేశారు. లేని పక్షంలో నెల అంతా టూర్ చేస్తున్న ఎంఈఓ-2 లకు ఎంపీడీవోలకు, ఇతర అధికారులకు చెల్లిస్తున్నట్లు వెహికల్ అలవెన్స్ మంజూరు చేసి మరింత పటిష్టంగా మానిటరింగ్ జరిగేలా చూడాలని ఆయన కోరారు.ఈ విషయంలో గౌరవ ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రివర్యులు, ఎమ్మెల్సీలు, అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించి విద్యావ్యవస్థలో ఇబ్బందులు తొలగించాలని, విద్యాభివృద్ధికి సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# కూటమి అభ్యర్థి కొత్తపల్లి శైలజ భారీ ప్రచారం ప్రజా జేజేల మధ్య సాగిన ఎన్నికల ప్రచారం

**నరసాపురం ; అక్టోబర్ 19 మీ వార్త జిల్లా ప్రతినిధి.** నర్సాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్నికల బరిలో ఎన్డీఏ కూటమి ఉమ్మడి అభ్యర్థిగా పోటీ చేస్తున్న జనసేన పార్టీ నాయకురాలు శ్రీమతి కొత్తపల్లి శైలజ గెలుపే లక్ష్యంగా నర్సాపురం పట్టణ ప్రాంత పరిధిలోని1 వార్డులలో భారీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జనసేన, తెలుగుదేశం, భారతీయ జనతా పార్టీ నాయకులు, కార్యకర్తలు, మరియు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్న ఈ ప్రచార కార్యక్రమం పండుగ వాతావరణాన్ని తలపించింది.ఈ సందర్భంగా కూటమి నేతలు, శ్రేణులతో కలిసి ఇంటింటికీ తిరుగుతూ, కొత్తపల్లి శైలజ స్థానిక ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను వివరిస్తూ, నర్సాపురం మున్సిపాలిటీ సమగ్ర అభివృద్ధి కోసం జనసేన పార్టీ 'గాజు గ్లాసు' గుర్తుపై ఓటు వేసి, తనను భారీ మెజారిటీతో గెలిపించాలని ఆమె అభ్యర్థించారు.ప్రజల నీరాజనాలు కొత్తపల్లి కుటుంబంపై నమ్మకం ఈశాన్య ప్రాంతంలో పర్యటించిన అభ్యర్థి శైలజ కి స్థానిక మహిళలు హారతులు పట్టి, పూలమాలలతో ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా కొత్తపల్లి శైలజ మాట్లాడుతూ.నర్సాపురం పట్టణ ప్రజలతో కొత్తపల్లి కుటుంబానికి దశాబ్దాల అనుబంధం ఉంది. నిరంతరం ప్రజాసేవలోనే ఉండే మా కుటుంబంపై ప్రజలు చూపిస్తున్న ఆదరాభిమానాలే మా బలం. మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డులను ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే నా ప్రథమ కర్తవ్యం.





తాగునీరు, డ్రైనేజీ, రహదారుల వంటి మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తాం" అని స్పష్టం చేశారు.ఈ భారీ ప్రచార కార్యక్రమంలో మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు, మాజీ ఎమ్మెల్యే కొత్తపల్లి జానకిరామ్ కూటమి నియోజకవర్గ ముఖ్య నేతలు, స్థానిక కౌన్సిలర్ అభ్యర్థి సందక సురేష్ టీడీపీ, బీజేపీల నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు మరియు వేలాది మంది అభిమానులు, కార్యకర్తలు పాల్గొని ప్రచారాన్ని విజయవంతం చేశారు.

# గత వైసీపీ ప్రభుత్వ పాలనలో నరసాపురం పట్టణంలో జరిగిన అభివృద్ధిని చూసి ఓటెయ్యండి.

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ చైర్ పర్సన్ అభ్యర్థిని కావలి రామ సీత.

**నరసాపురం అక్టోబర్ 19 మీ వార్త జిల్లా ప్రతినిధి.** ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ వారి అవసరాలను తీర్చే వాలంటీర్లను కూటమి ప్రభుత్వం తొలగించింది. (కూటమి ప్రభుత్వానికి వాలంటీర్లు ఓటుతో బుద్ధి చెప్పాలి)....కొడమంచిలి సంతోషి రాణి, మాట్లాడారు.ప్రజలారా కూటమి ప్రభుత్వానికి మీ ఓటుతో బుద్ధి చెప్పండి.... జగనన్న,ముదునూరి నాయకత్వాన్ని బలపరచండి. నరసాపురం పట్టణం 32 వ వార్డులో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ చైర్ పర్సన్ అభ్యర్థిని కావలి రామ సీత,32 వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థిని కొడమంచిలి సంతోషి రాణి, మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అరాచకాలను ప్రజలు గమనిస్తున్నారని తప్పకుండా కూటమి ప్రభుత్వానికి అపజయం తప్పదని అన్నారు. నరసాపురం మున్సిపల్ చైర్ పర్సన్ గా పోటీ చేసిన రామ సీతను అత్యధిక మెజార్టీతో గెలవడం ఖాయమని ఆమె అన్నారు.



# పడమర విప్పర్రులో ఎన్నికల సమన్వయ కమిటీ సమావేశం

**పెంటపాడు అక్టోబర్ 19 (మీ వార్త ప్రతినిధి)** మండలంలోని పడమర విప్పర్రులో జనసేన నాయకుడు ఘంటా నాగ సుబ్రహ్మణ్యం నివాసంలో సోమవారం తాడేపల్లిగూడెం అసెంబ్లీ నియోజకవర్గ స్థానిక ఎన్నికల కోఆర్డినేషన్ కమిటీ సమన్వయకర్తలు గట్టిం రాధాకృష్ణ, ఘంటా నాగ సుబ్రహ్మణ్యేశ్వరరావు, కొవ్వూరి లక్ష్మణరెడ్డి ఆధ్వర్యంలో జనసేన నాయకుల సమన్వయ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జనసేన పార్టీ యువ నాయకులు బొలిశెట్టి రాజేష్, తోట రాజా, పెంటపాడు మండలం అధ్యక్షుడు పుల్లా బాబీ, పట్టణ అధ్యక్షుడు వర్తనపల్లి కాశి, పాలూరి వెంకటేశ్వరరావు, నీలపాల దినేష్ యాదవ్, చామన సురేష్, హాజరయ్యారు. ఈ సమన్వయ సమావేశంలో వీరంతా రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో నూటికి నూరు శాతం అభ్యర్థుల విజయమే లక్ష్యంగా నాయకులు కార్యకర్తలు పనిచేయాలని నిర్దేశించారు. పార్టీ శ్రేణులంతా ఎన్నికలకు సమాయత్తం అయ్యి క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు. కూటమి నాయకుల సమన్వయంతో ఎన్నికలకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. అదే క్రమంలో ప్రజల సమస్యలను తెలుసుకుంటూ ప్రజలకు మరింత చెరువు కావాలని చర్చించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# మణికంఠ క్షేత్రంలో మాజీ ఎమ్మెల్యే సండ్ర ప్రత్యేక పూజలు

శ్రీ శివగిరి మణికంఠ ఆలయం అభివృద్ధి చెందాలని స్వామివారికి మొక్కులు



**తల్లాడ, మీ వార్త ప్రతినిధి. 19.10.2026** తల్లాడ మండలం నూతనకల్లు గ్రామంలోని శ్రీ శివగిరి మణికంఠ క్షేత్రాన్ని సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, కొబ్బరికాయ కొట్టి ఆలయం దినదినాభివృద్ధి చెందాలని ప్రార్థించారు. స్వామివారి ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దొడ్డ శ్రీను, నూతనకల్లు మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ నాయకులు తూము శ్రీనివాసరావు, నాయుడు శ్రీనివాసరావు, వెంకట్‌లాల్, వీరమోహన్ రెడ్డి, కిన్నెర శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# బంటుమిల్లి వైసీపీ పార్టీకి జడ్పీటీసీ గా బొర్రా రమేష్

**బంటుమిల్లి అక్టోబర్ 19(మీ వార్త ప్రతినిధి)** బంటుమిల్లి మండల జడ్పిటిసి సభ్యుడిగా అర్తమూరు మాజీ సర్పంచ్ బొర్రా రమేష్ ని అభ్యర్థించిన పెడన నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ శ్రీ ఉప్పాల రాము



# కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలి

జనసేన పార్టీ యువ నాయకుడు బొలిశెట్టి రాజేష్



**తాడేపల్లిగూడెం అక్టోబర్ 19 టమీ వార్త ప్రతినిధిఃఃః** స్థానిక సంస్థల ఎన్నికలలో కూటమి అభ్యర్థులు విజయమే లక్ష్యంగా కూటమి నాయకులు కార్యకర్తలు పనిచేయాలని జనసేన పార్టీ యువ నాయకుడు బొలిశెట్టి రాజేష్ అన్నారు. నరసాపురం పార్లమెంట్ పరిధి, తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని నిర్వహించిన సమన్వయ సమావేశంలో గౌరవ అతిథులుగా యువ నాయకులు బొలిశెట్టి రాజేష్, తోట రాజా పాల్గొన్నారు.ఈ సమావేశంలో జనసేన పార్టీ నాయకులు పాల్గొని, రాబోయే ఎన్నికలకు పార్టీ శ్రేణులను సమాయత్తం చేయడం, క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడం, కూటమి నాయకుల మధ్య సమన్వయంతో ముందుకు సాగడం, ప్రజల సమస్యలను తెలుసుకుంటూ ప్రజలకు మరింత చేరువ కావడం వంటి అంశాలపై చర్చించారు.రాబోయే ఎన్నికల్లో సమిష్టి కృషి, ఐక్యత, సమన్వయంతో ముందుకు సాగుతూ పార్టీ విజయానికి ప్రతి నాయకుడు, కార్యకర్త కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వర్తనపల్లి కాశి, పుల్లా బాబీ, పాలూరు వెంకటేశ్వరరావు, కట్టుబోయిన కృష్ణ ప్రసాద్, నీలపాల దినేష్ యాదవ్, కొవ్వూరి లక్ష్మణరెడ్డి, చామన సురేష్, గట్టిం నాని, తదితరులు పాల్గొన్నారు.

# కనకదుర్గమ్మకు రూ.50 వేల విలువైన బంగారు బొట్టు సమర్పణ

మహర్నవమి సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు



**ఆలమూరు, అక్టోబర్ 19(మీ వార్త ప్రతినిధి )** ఆలమూరు నాగుల చెరువు గట్టుపై కొలువై ఉన్న శ్రీ కనకదుర్గాదేవి అమ్మవారికి మహర్నవమి సందర్భంగా రూ.50 వేల విలువైన బంగారు బొట్టును భక్తితో సమర్పించారు. మండల కేంద్రమైన ఆలమూరు గ్రామానికి చెందిన రాష్ట్ర బీసీ ఎంప్లాయిస్ సంక్షేమ సంఘం అధ్యక్షులు గుత్తుల వీరబ్రహ్మం, మంగాదేవి దంపతుల కుమార్తె, అల్లుడు అమెరికా వాస్తవ్యులు కాకి గౌతమ్, పావనీసుధా దంపతులు సోమవారం ఈ బంగారు బొట్టును అమ్మవారికి అందజేశారు.ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు బంగారు బొట్టును అమ్మవారికి అలంకరించి పూజలు జరిపారు. అమ్మవారిపై తమకున్న భక్తి, విశ్వాసంతో బంగారు బొట్టును సమర్పించిన దాతల కుటుంబాన్ని పలువురు అభినందించారు.

# నియోజక వర్గ ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు .. ఎమ్మెల్యే అంజిబాబు

**భీమవరం ; అక్టోబర్ 19 మీ వార్త జిల్లా ప్రతినిధి.** చెడుపై మంచిని సాధించిన విజయమే విజయదశమి అని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. భీమవరం నియోజకవర్గ ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని దుర్గామాతను వేడుకుంటూ అందరికీ విజయదశమి శుభాకాంక్షలు తెలియజేశారు.



# ఆదివాసీ సంప్రదాయానికి ప్రతీకగా భీముని పెళ్లి సంబరం

## ఐదు రోజుల పాటు ఘనంగా వేడుకలు..

**చింతూరు, అక్టోబర్ 19 మీ వార్త ప్రతినిధి :** ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే భీముని పెళ్లి వేడుకలు చింతూరు మండలం చూటూరు గ్రామంలో ఘనంగా నిర్వహించేందుకు గ్రామస్తులు ఏర్పాట్లు చేస్తున్నారు.ప్రతి మూడేళ్లకోసారి ఐదు రోజుల పాటు నిర్వహించే ఈ వేడుకలు ఈ నెల 15వ తేదీ నుంచి 19వ తేదీ వరకు కొనసాగుతాయి.గ్రామం సుభిక్షంగా ఉండాలని, వ్యవసాయ పంటలు సమృద్ధిగా పండాలని, వర్షాలు సమృద్ధిగా కురవాలని కోరుకుంటూ ఆదివాసీలు సంప్రదాయబద్ధంగా ఈ వేడుకలను నిర్వహిస్తారు. మొదటి రోజు నుంచే గ్రామంలో సంబరాలు ప్రారంభమవుతాయి.నాలుగో రోజు గ్రామస్తులంతా అడవికి వెళ్లి పెళ్లి పందిరికి అవసరమైన సామగ్రిని తీసుకొస్తారు.అనంతరం పెళ్లికొడుకు,పెళ్లికూతురిని సంప్రదాయబద్ధంగా అలంకరించి,పాలు పొంగించే కార్యక్రమం నిర్వహిస్తారు.




గ్రామ పెద్దలు,పూజారి, పటేల్ సమక్షంలో వివాహ వేడుక జరిపించి తలంబ్రాలు పోస్తారు.ఐదో రోజు కోళ్లు, జంతువులను బలి ఇచ్చి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.అనంతరం పెళ్లి పందిరిపై దేవుని పవిత్ర జలాలను పోస్తారు. గ్రామ ప్రజలంతా పందిరి కింద నిలబడి ఆ నీటిలో తడుస్తూ దేవుని ఆశీస్సులు పొందుతారు.ఈ కార్యక్రమం ముగిసిన అనంతరం



గ్రామస్తులు తమ ఇళ్లకు తిరిగి వెళ్తారు.తరతరాలుగా వస్తున్న ఈ ఆచారం ఆదివాసీల ఐక్యతకు, ప్రకృతితో ముడిపడిన జీవన విధానానికి నిదర్శనంగా నిలుస్తోంది.గ్రామ ప్రజల సంక్షేమం,మంచి వర్షాలు, పంటల సమృద్ధిని ఆకాంక్షిస్తూ నిర్వహించే భీముని పెళ్లి వేడుకలు ఆదివాసీ సంస్కృతిలో విశిష్ట స్థానాన్ని కలిగి ఉన్నాయి.

# గూడూరు కప్పలదొడ్డిలో ఘనంగా అమ్మవారి నగరోత్సవం



**గూడూరు అక్టోబర్ 19(మీ వార్త ప్రతినిధి)** మేళతాళాలు, భక్తుల కోలాహలం నడుమ అమ్మవారి ఊరేగింపు గూడూరు: కృష్ణా జిల్లా గూడూరు మండలం కప్పలదొడ్డి గ్రామంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి నగరోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి మేళతాళాల నడుమ గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. అమ్మవారి నగరోత్సవంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మేళతాళాలు, భక్తుల జయజయధ్వానాల మధ్య సాగిన నగరోత్సవంతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. అమ్మవారి దర్శనం కోసం గ్రామస్తులు, చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. అమ్మవారి కృపాకటాక్షాలు గ్రామ ప్రజలందరిపై ఉండాలని భక్తులు ప్రార్థించారు. శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.

# మచిలీపట్నం డివిజన్ ఫోటో ట్రేడ్ వెల్ఫేర్ అసోసియేషన్ వారి సర్వసభ్య సమావేశం

**మచిలీపట్నం అక్టోబర్ 19(మీ వార్త ప్రతినిధి)** ఈరోజు స్థానిక బస్టాండ్ సెంటర్ నందు గల ఈశ్వర్ రెసిడెన్సీలో మచిలీపట్నం డివిజన్ ఫోటో ట్రేడ్ వెల్ఫేర్ అసోసియేషన్ వారి సర్వసభ్య సమావేశం జరిగినది మచిలీపట్నం పరిసర ప్రాంతాల నుంచి అనేకమంది ఫోటోగ్రాఫర్లు ఈ కార్యక్రమంలో పాల్గొని వారి విధి విధానాలు యూనియన్ ద్వారా చేయు కార్యక్రమాల గురించి చర్చించుకోవడం జరిగింది. ఈ యూనియన్ కి నూతనంగా ఎన్నుకున్న అధ్యక్ష కార్యదర్శులు కార్యవర్గ సభ్యుల్ని వచ్చిన సభ్యులందరూ అభినందనలు తెలియజేశారు అధ్యక్షులుగా సుధీర్ గురజాల సెక్రటరీగా అనంత వంక గారిని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది ఈ కార్యక్రమానికి మచిలీపట్నం నగర మేయర్ గా పోటీ చేయుచున్న కూటమి అభ్యర్థి శ్రీమతి అబ్దుల్ అబిదా బేగం గారు విచ్చేసి నూతన



కార్యవర్గాన్ని కి అభినందనలు తెలియజేసి ఫోటోగ్రాఫర్ల సమస్యలన్నీ తెలుసుకొని తమ వంతు కృషి తప్పకుండా చేస్తానని హామీ ఇవ్వడం జరిగింది. కూటమి అభ్యర్థి ఈ కార్యక్రమానికి హాజరవ్వటం పట్ల ఫోటోగ్రాఫర్లందరూ హర్షం వ్యక్తం చేసి మీ విజయానికి సహకరిస్తామని తెలియజేశారు

# తాడేపల్లిగూడెం కూటమిలో కీలక పరిణామం..!



**తాడేపల్లిగూడెం అక్టోబర్ 18 (మీ వార్త ప్రతినిధి)** తాడేపల్లిగూడెం మున్సిపల్ చైర్మన్ పదవి జనసేనకు కేటాయించడంపై టీడీపీలో నెలకొన్న అసంతృప్తి నేపథ్యంలో కీలక పరిణామం చోటు చేసుకుంది. టీడీపీ అసంతృప్తి నేత, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ గొర్రెల శ్రీధర్, టీడీపీ పెంటపాడు మండలం అధ్యక్షుడు కిలపర్తి వెంకట్రావు స్థానిక ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ తో భేటీ అయ్యారు. టీడీపీ నేతల నిరసనల నేపథ్యంలో ఈ భేటీ ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ సందర్భంగా గొర్రెల శ్రీధర్ మాట్లాడుతూ కూటమి నిర్ణయాలకు కట్టుబడి ఉంటానని తెలిపారు. ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ స్పందిస్తూ కూటమిలో శ్రీధర్ కు సముచిత స్థానం ఉంటుందని హామీ ఇచ్చారు.

# దేవాలయాల సమస్యలపై విశ్వ హిందూ పరిషత్ వినతి

## దేవాదాయ శాఖ స్పందన

**మచిలీపట్నం, అక్టోబర్ 19: (మీ వార్త ప్రతినిధి)** కృష్ణా జిల్లాలోని దేవాలయాల నిర్వహణ, అభివృద్ధి, భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనతో పాటు ఆలయాలకు సంబంధించిన సమస్యల పరిష్కారం కోసం విశ్వ హిందూ పరిషత్ -- కృష్ణా జిల్లా సమర్పించిన వినతిపై జిల్లా దేవాదాయ శాఖ అధికారులు స్పందించారు.ఈ మేరకు జిల్లా దేవాదాయ శాఖ కార్యాలయం నుంచి 18-10-2026 తేదీన జారీ చేసిన ఎండార్స్‌మెంట్‌ను విశ్వ హిందూ పరిషత్ కృష్ణా జిల్లా కార్యాలయ కార్యదర్శి జొన్నలగడ్డ సుబ్రహ్మణ్యంకు తెలియజేశారు. దేవాలయాలకు సంబంధించిన అంశాలపై సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు ఆ లేఖలో పేర్కొన్నారు.దేవాలయాలు మన సంస్కృతి, సంప్రదాయాలు, ధార్మిక వారసత్వానికి ప్రతీకలని, వాటి పరిరక్షణ సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని విశ్వ హిందూ పరిషత్ నాయకులు పేర్కొన్నారు. ఆలయాల్లో మౌలిక సదుపాయాల మెరుగుదల, భక్తులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం, దేవాలయాల ఆస్తుల పరిరక్షణ, ధార్మిక కార్యక్రమాల నిర్వహణకు అనుకూల వాతావరణం కల్పించడం వంటి అంశాలపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు.
కృష్ణా జిల్లాలోని దేవాదాయ శాఖ పరిధిలో ఉన్న దేవాలయాలను సందర్శించి, వాటి సమస్యలను గుర్తించి, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లే కార్యక్రమాన్ని విశ్వ హిందూ పరిషత్ చేపట్టనుంది. ఆలయ కమిటీలు, అర్చకులు, భక్తులతో సమన్వయం చేసుకుంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని జిల్లా నాయకత్వం నిర్ణయించింది.
దేవాలయాల పరిరక్షణ, ధార్మిక వారసత్వ సంరక్షణ, భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పన లక్ష్యంగా విశ్వ హిందూ పరిషత్ తన కృషిని కొనసాగిస్తుందని జిల్లా అధ్యక్షులు డా. బూరగడ్డ శ్రీనాథ్ తెలిపారు.
జొన్నలగడ్డ సుబ్రహ్మణ్యం
కార్యాలయ కార్యదర్శి



PGRS-KRI2026092112581

జిల్లా ఎండోమెంట్స్ అధికారి వారి కార్యాలయం,
దేవదాయ ధర్మదాయ శాఖ,
కృష్ణాజిల్లా, మచిలీపట్నం.

ఆర్.సి.నం. బి3/1125655/2023 తేది. 18.10.2026.

ఎండార్స్ మెంట్

ఆర్జీదారు శ్రీ జొన్నలగడ్డ సుబ్రహ్మణ్యం, రాజుపేట, మచిలీపట్నం, కృష్ణా జిల్లా అను వారు జిల్లాలోని అన్ని దేవాలయములలో త్రాగునీటి సౌకర్యం కల్పించవలసిందిగా మరియు దేవాలయ ప్రాగణం మరియు చుట్టుప్రక్కల పరిశుభ్రముగా పారిశుధ్యం చేయవలసిందిగా చర్యలు తీసుకొనవలసిందిగా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ వేదికగ అర్జీ ద్వారా కోరియున్నారు.

ఇందు విషయమై తమకు మనవి చేయునది ఏమనగా, కృష్ణాజిల్లాలో పనిచేయుచున్న అందరి కార్యనిర్వహణాధికారుల వారికి దేవాలయాలకు సందర్శించిన భక్తులకు అందరికి స్వచ్ఛమైన త్రాగునీరు అందుబాటులో ఉంచవలసిందిగా మరియు ఎటువంటి అసౌకర్యం కలగకుండా దేవాలయ ప్రాగణం మరియు చుట్టుప్రక్కల పరిశుభ్రముగా పారిశుధ్యం చేయవలసిందిగా ఆదేశములు జారీ చేసియున్నామని తమకు తెలియచేయడమైనది.

N. V. [signature]
సహాయ కమీషనర్

శ్రీ జొన్నలగడ్డ సుబ్రహ్మణ్యం,
రాజుపేట, మచిలీపట్నం,
ఫోన్ నెం.9290503812.
ఇందలి నకలు ఈ కార్యాలయం బి3 సెక్షన్ ఫైల్ కు సమాచారం నిమిత్తం.

విశ్వ హిందూ పరిషత్ -- కృష్ణా జిల్లా

# ఇండియన్ బ్యాంకులో ఇంటర్న్‌షిప్ పూర్తి చేసిన కొమ్ముగూడెం పాఠశాల విద్యార్థులు



**తాడేపల్లిగూడెం అక్టోబర్ 19 (మీ వార్త ప్రతినిధి)**కొమ్ముగూడెం జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు దసరా సెలవుల్లో భాగంగా అక్టోబర్ 12 నుండి 19 వరకు కొమ్ముగూడెం ఇండియన్ బ్యాంకులో 10 రోజుల ఇంటర్న్‌షిప్ పూర్తి చేశారు. వృత్తి విద్యలో బిఎఫ్ఎస్ఐ కోర్సు అభ్యసిస్తున్న విద్యార్థులు బ్యాంకు ఖాతాల నిర్వహణ, నగదు లావాదేవీలు, పొదుపు పద్ధతులు, డిజిటల్ బ్యాంకింగ్ సేవలపై ప్రాయోగిక పరిజ్ఞానం పొందారు. ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థులకు ఆచరణాత్మక పరిజ్ఞానంతో పాటు ఉపాధి అవకాశాలకు దోహదపడతాయని ప్రధానోపాధ్యాయులు శ్రీ మూర్తి, వృత్తి విద్యా సమన్వయకర్త శ్రీ విష్ణు ప్రసాద్ తెలిపారు. విద్యార్థులకు మార్గదర్శకత్వం వహించిన వృత్తి విద్యా శిక్షకురాలు శ్రీమతి అంజనా కృషిని అభినందించారు.

# చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక విజయదశమి:

## ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

**గుడివాడ అక్టోబర్ 19(మీ వార్త ప్రతినిధి)**
గుడివాడ నియోజకవర్గ ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే రాము.
దుర్గామాత ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థన..
గుడివాడలో దేవి శరన్నవరాత్రి ముగింపు వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే రాము..
అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు... చేసిన ఎమ్మెల్యే రాము
గుడివాడ అక్టోబర్ 19:చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక విజయదశమి పర్వదినమని, ఈ పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో కొత్త ఆశలు, ఆనందం, ఐశ్వర్యం, విజయాలను తీసుకురావాలని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆకాంక్షించారు. దుర్గామాత ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, ప్రతి కుటుంబంలో శాంతి సౌభాగ్యాలు వెల్లివిరియాలని ఆయన ప్రార్థించారు. విజయదశమి సందర్భంగా గుడివాడ నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే రాము హృదయపూర్వక దసరా శుభాకాంక్షలు తెలియజేశారు. గుడివాడ పట్టణంలో నిర్వహిస్తున్న శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాల ముగింపు వేడుకల్లో భాగంగా ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పలు ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని ప్రసిద్ధ నీలా మహల్ రోడ్డులో ఉన్న శ్రీ విజయదుర్గ అమ్మవారి దేవస్థానంతో పాటు జగన్నాధపురంలోని శ్రీ వెంకటేశ్వర స్వామివారి ఆలయంలో జరిగిన ఉత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామివారికి, అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, ప్రజలందరికీ మేలు జరగాలని ప్రార్థించారు. ముందుగా ఆలయాలకు చేరుకున్న ఎమ్మెల్యే రాముకు దేవాదాయ శాఖ అధికారులు, ఆలయ కమిటీ పెద్దలు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అనంతరం వేద





పండితులు వేద మంత్రాలతో ఆశీర్వచనాలు అందించి, అమ్మవారి శేషవస్త్రాలతో ఎమ్మెల్యే రామును సత్కరించారు. శ్రీ విజయ దుర్గ అమ్మవారి దేవస్థానంలో ప్రత్యేక పూజలు చేసిన పండ్ల ప్రసాదాన్ని ఎమ్మెల్యే రాము కూటమి నాయకులకు వేద పండితులు అందజేశారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మాట్లాడుతూ, విజయదశమి కేవలం పండుగ మాత్రమే కాదని, ధర్మం, న్యాయం, సత్యం చివరకు విజయాన్ని సాధిస్తాయనే గొప్ప సందేశాన్ని అందించే పవిత్రమైన పర్వదినమని పేర్కొన్నారు. చెడుపై మంచి, అధర్మంపై ధర్మం సాధించిన విజయాన్ని స్మరించుకుంటూ ప్రతి ఒక్కరూ తమ జీవితాల్లో మంచిని ఆచరించాలని, సమాజ శ్రేయస్సుకు దోహదపడాలని అన్నారు.
దుర్గామాత అనుగ్రహంతో ప్రజలందరి జీవితాల్లో అడ్డంకులు తొలగి, చేపట్టిన ప్రతి మంచి కార్యం విజయవంతం కావాలని ఆకాంక్షించారు. పండుగలు మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలని, కుటుంబ సభ్యుల మధ్య అనుబంధాలను బలోపేతం చేయడంతో పాటు సమాజంలో ఐక్యతను పెంపొందిస్తాయని పేర్కొన్నారు.అమ్మవారి ఆశీస్సులతో గుడివాడ నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందాలని, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ముందుకు సాగాలని ఎమ్మెల్యే రాము ఆకాంక్షించారు. రాష్ట్రంలో ప్రజా సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్న కూటమి ప్రభుత్వానికి దుర్గామాత ఆశీస్సులు లభించాలని, రాష్ట్రం అన్ని రంగాల్లో పురోగతి సాధించాలని ప్రార్థించినట్లు తెలిపారు.
ఈ విజయదశమి ప్రతి ఒక్కరి జీవితాల్లో విజయాలకు నాంది పలకాలని, ప్రజలందరికీ సుఖశాంతులు, సిరిసంపదలు, ఆయురారోగ్యాలు ప్రసాదించాలని కోరుకుంటూ మరోసారి గుడివాడ నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము దసరా శుభాకాంక్షలు తెలియజేశారు.
కార్యక్రమంలో శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం ధర్మకర్తల కమిటీ చైర్మన్ లింగం చిట్టిబాబు, ఈవో కందుల గోపాలరావు, శ్రీ విజయ దుర్గ అమ్మవారి దేవస్థానం కమిటీ చైర్మన్ బి హరిబాబు, ఈవో గంగు శిరీష, జనసేన ఇంచార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, గుడివాడ టిడిపి అధ్యక్షు పంద్రాజు సాంబశివరావు, టిడిపి నాయకులు లింగం ప్రసాద్, దింట్యాల రాంబాబు, చేకూరు జగన్మోహన్రావు, వేద పండితులు వేదాంతం అప్పలాచారి, పునీత్ శర్మ,శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం ధర్మకర్తల కమిటీ మాజీ చైర్మన్ చలసాని ఇందిరా రమణారావు, టిడిపి నాయకులు బొంబాయి శ్రీను,వంగపండు ఆదినారాయణ, రామిదేనీ వేణుబాబు, ఆలయాల కమిటీల సభ్యులు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# అమరవరం పంచాయతీలో వైఎస్సార్‌సీపీ ఐడీ కార్డుల పంపిణీ



**అమరవరం, అక్టోబర్ 19 (మి వార్తా ప్రతినిధి)** కుకునూరు మండలం అమరవరం పంచాయతీలో ఈరోజు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ (వైఎస్సార్‌సీపీ)కి సంబంధించిన ఐడీ కార్డులను రాజేష్, బాబు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీకి సంబంధించిన వారు పాల్గొన్నారు.

# ప్రజల ఆశీర్వాదమే ఎన్డీఏ కూటమి బలం




## ప్రజల సంక్షేమమే మా ధ్యేయం

## రాష్ట్ర అభివృద్ధే మా లక్ష్యం

## కూటమి అభ్యర్థులను గెలిపించండి.. రాష్ట్ర అభివృద్ధికి బాటలు వేయండి

## చెప్పాం.. చేస్తున్నాం.. ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తున్నాం - కరపత్రం ఆవిష్కరణ.

## స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ కూటమికి అండగా నిలవండి:

## మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎంపీలు సానా సతీష్, గంటి హరీష్ మాధుర్ పిలుపు

**రామచంద్రపురం మీ వార్తా ప్రతినిధి అక్టోబర్ 19:** గత సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీఏ కూటమిపై నమ్మకంతో ప్రజలు 94 శాతం స్ట్రైక్ రేట్‌తో చారిత్రాత్మక విజయాన్ని అందించారని, అదే నమ్మకాన్ని స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ కొనసాగిస్తూ కూటమి అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, రాజ్యసభ సభ్యులు సానా సతీష్, అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాధుర్, కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం ప్రజలకు పిలుపునిచ్చారు. సోమవారం రామచంద్రపురంలో మంత్రి వాసంశెట్టి సుభాష్ కార్యాలయంలో స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి నిర్వహించిన సమావేశంలో మంత్రి సుభాష్, ఎంపీలు సానా సతీష్, గంటి హరీష్ మాధుర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా 'చెప్పాం.. చేస్తున్నాం..' పేరుతో రూపొందించిన అభివృద్ధి, సంక్షేమ పథకాల వివరాలతో కూడిన కరపత్రాలను ఆవిష్కరించారు.

ప్రజల నమ్మకమే మా బలం.. అభివృద్ధే మా లక్ష్యం- మంత్రి సుభాష్ ఈ సందర్భంగా మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ.. ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి లోకేష్ సహకారంతో, మంత్రి నారా లోకేష్ మార్గదర్శకత్వంలో రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలనకు పెద్దపీట వేస్తున్నామని పేర్కొన్నారు. చెప్పడం మాత్రమే కాదు.. చెప్పిన ప్రతి మాటను చేతల్లో చూపిస్తున్నాం. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నాం. ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే మా ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అని మంత్రి స్పష్టం చేశారు. సూపర్ సిక్స్ పథకాల ద్వారా అర్హులైన కుటుంబాలకు సంక్షేమ ఫలాలను అందిస్తున్నామని, కులమతాలు, వర్గ విభేదాలకు అతీతంగా ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా పాలన అందిస్తున్నామని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాల వరకు మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తూ రహదారులు, తాగునీరు, గృహ నిర్మాణం, పారిశుద్ధ్యం, విద్య, వైద్యం వంటి రంగాల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నామని వివరించారు. ప్రజలకు మెరుగైన భవిష్యత్తును అందించేందుకు ఇంటి స్థలాలు, గృహ వసతి, తాగునీరు, సోలార్ రూఫ్‌టాప్ సదుపాయాలు, మరుగుదొడ్లు, ఇంటర్నెట్ సౌకర్యాలు, నైపుణ్య శిక్షణ వంటి అంశాలకు ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు.

గ్రామాలు, పట్టణాలు అభివృద్ధి చెందాలంటే స్థానిక సంస్థల్లోనూ ప్రజల మద్దతు అవసరమని, అభివృద్ధి కార్యక్రమాలకు ఆటంకాలు లేకుండా కొనసాగించేందుకు కూటమి అభ్యర్థులను గెలిపించాలని మంత్రి సుభాష్ కోరారు.

సంక్షేమం ప్రతి ఇంటికీ.. అభివృద్ధి ప్రతి ప్రాంతానికీ - ఎంపీ సానా సతీష్

రాజ్యసభ సభ్యులు సానా సతీష్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజలు ఎన్డీఏ కూటమిపై ఉంచిన విశ్వాసానికి అనుగుణంగా ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తోందని పేర్కొన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ఫలాలు అందేలా కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేసే ప్రభుత్వానికి స్థానిక సంస్థల్లోనూ ప్రజల సహకారం ఎంతో అవసరం. గ్రామాల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపడాలి.. పట్టణాల్లో అభివృద్ధి వేగవంతం కావాలి.. ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందాలి. ఈ లక్ష్యాలను సాధించాలంటే స్థానిక సంస్థల్లో కూటమి బలపడాలి అని సానా సతీష్ అన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు నిరంతరాయంగా కొనసాగేందుకు కూటమి అభ్యర్థులకు ప్రజలు మద్దతుగా నిలవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

సుపరిపాలనకు ప్రజల మద్దతు కొనసాగాలి - ఎంపీ గంటి హరీష్ మాధుర్

అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాధుర్ బాలయోగి మాట్లాడుతూ.. ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీల అమలుతోపాటు రాష్ట్ర పునర్నిర్మాణానికి ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు.

అభివృద్ధి అనేది కేవలం ప్రకటనలకే పరిమితం కాకూడదు. ప్రజలకు ప్రత్యక్షంగా ప్రయోజనం చేకూరాలి. ప్రతి గ్రామంలో మౌలిక సదుపాయాలు మెరుగుపడాలి. ప్రతి పట్టణంలో అభివృద్ధి పనులు వేగంగా జరగాలి. యువతకు ఉపాధి అవకాశాలు పెరగాలి. పేద కుటుంబాలకు సంక్షేమ భరోసా కలగాలి. ఈ లక్ష్యాలతోనే కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోంది అని ఎంపీ పేర్కొన్నారు.

ప్రజలు గత ఎన్నికల్లో ఇచ్చిన తీర్పును గౌరవిస్తూ, వారి నమ్మకాన్ని నిలబెట్టుకునేలా ప్రభుత్వం పనిచేస్తోందని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ కూటమి అభ్యర్థులను గెలిపించి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు మరింత బలాన్ని చేకూర్చాలని కోరారు.

ఈ సందర్భంగా ఆవిష్కరించిన కరపత్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, ప్రజలకు కల్పిస్తున్న మౌలిక సదుపాయాల వివరాలను పొందుపరిచారు.

గృహ నిర్మాణం: పేదలకు సొంతింటి కలను సాకారం చేసే దిశగా ఇళ్ల నిర్మాణానికి ప్రాధాన్యం. అర్హులైన కుటుంబాలకు ఇళ్ల కల్పనపై దృష్టి. సాగునీరు, తాగునీరు: నీటి వనరుల అభివృద్ధి, ప్రజలకు



అవసరమైన నీటి సదుపాయాల కల్పన.
విద్యుత్ సదుపాయాల విస్తరణ, సంబంధిత మౌలిక వసతుల అభివృద్ధి.
గ్రామీణ రహదారులు: గ్రామాలను అనుసంధానించే రహదారుల నిర్మాణం, అభివృద్ధి.
గ్యాస్, ఇంటర్నెట్ సదుపాయాలు: ప్రజలకు మెరుగైన సాంకేతిక, జీవన సౌకర్యాల కల్పన.
మరుగుదొడ్లు, పారిశుద్ధ్యం: పరిశుభ్రమైన పరిసరాలు, మెరుగైన ప్రజారోగ్యం కోసం చర్యలు.
నైపుణ్య శిక్షణ, ఉపాధి: యువతకు నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలను పెంపొందించే కార్యక్రమాలు.
ఈ కార్యక్రమాల ద్వారా ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడం, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిని వేగవంతం చేయడం, పట్టణాల్లో మెరుగైన మౌలిక సదుపాయాలను కల్పించడం ప్రభుత్వ లక్ష్యమని నాయకులు వివరించారు.

స్థానిక ఎన్నికల్లోనూ కూటమి విజయమే లక్ష్యం

రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలన కొనసాగాలంటే స్థానిక సంస్థల్లోనూ ప్రజలు కూటమికి అండగా నిలవాలని నాయకులు విజ్ఞప్తి చేశారు. ప్రజల సమస్యలకు పరిష్కారం చూపుతూ, స్థానిక అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపట్టేందుకు కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు.
ప్రజల ఆశీర్వాదమే మా బలం.. ప్రజల సంక్షేమమే మా ధ్యేయం.. రాష్ట్ర అభివృద్ధే మా లక్ష్యం. గత ఎన్నికల్లో మాపై ఉంచిన నమ్మకాన్ని స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ కొనసాగించి, కూటమి అభ్యర్థులను గెలిపించండి. అభివృద్ధి ప్రస్థానంలో భాగస్వాములు కండి అని మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎంపీలు సానా సతీష్, గంటి హరీష్ మాధుర్ సంయుక్తంగా ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం, ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్, నియోజకవర్గ పరిశీలకురాలు మజ్జి పద్మావతి, జనసేన ఇన్చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, పట్టణ టిడిపి అధ్యక్షులు ఉండవెల్లి శివ, కర్రి చిట్టిబాబు, కూటమి పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# చెరుకుమిల్లి శివాలయంలో భక్తిశ్రద్ధలతో రుద్రార్చన -- కుంకుమార్చన

## విశ్వ హిందూ పరిషత్ -- కృష్ణా జిల్లా అధ్వర్యంలో

**కృత్తివెన్ను, అక్టోబర్ 19(మీ వార్త ప్రతినిధి)** గ్రామగ్రామాన మహిళల భాగస్వామ్యంతో ధార్మిక చైతన్యం -- సామాజిక సమరసతకు ప్రాధాన్యం : విశ్వ హిందూ పరిషత్ కృష్ణా జిల్లా ఆధ్వర్యంలో, జిల్లా అధ్యక్షుల సూచన మేరకు కృత్తివెన్ను మండలం చెరుకుమిల్లి గ్రామంలోని శివాలయంలో రుద్రార్చన, కుంకుమార్చన కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 45 మంది మహిళలు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల ఉత్సాహభరిత భాగస్వామ్యంతో పూజా కార్యక్రమాలు విజయవంతంగా ముగిశాయి. విశ్వ హిందూ పరిషత్ కృష్ణా జిల్లా ఆధ్వర్యంలో గ్రామగ్రామాన ధార్మిక చైతన్యాన్ని విస్తరించడం, మహిళల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం, హిందూ సమాజ ఐక్యతను బలోపేతం చేయడం, సామాజిక సమరసతను పెంపొందించడం లక్ష్యంగా ఇటువంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని దేవాలయాలను కేంద్రంగా చేసుకొని మహిళలను ధార్మిక కార్యక్రమాల్లో భాగస్వాములను చేయడం ఈ కార్యక్రమాల ప్రత్యేకతగా నిలుస్తోంది. భక్తి, ధర్మం, సామాజిక సమరసత పరస్పర అనుబంధంతో సమాజంలో ఐక్యతను పెంపొందిస్తాయని, కులమత భేదాలకు అతీతంగా పరస్పర గౌరవం, సోదరభావంతో మెలగడం అవసరమని నిర్వాహకులు పేర్కొన్నారు. ప్రతి గ్రామంలోనూ ఇటువంటి కార్యక్రమాల ద్వారా ధార్మిక చైతన్యంతో పాటు సామాజిక ఐక్యతను మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో శ్రీ పుప్పాల నరసింహరావు, శ్రీ ఎల్లూరి నాగబాబు, శ్రీ నీలజలం, శ్రీమతి జన్యావుల ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన నిర్వాహకులను విశ్వ హిందూ పరిషత్ కృష్ణా జిల్లా ప్రభారి శ్రీ పి.వి.ఎస్. నాయుడు, జిల్లా అధ్యక్షులు డా. బూరగడ్డ శ్రీనాథ్ అభినందించారు. గ్రామస్థాయిలో



మహిళలను పెద్ద సంఖ్యలో భాగస్వాములను చేస్తూ ధార్మిక చైతన్యం, హిందూ సమాజ ఐక్యత, సామాజిక సమరసత కోసం చేస్తున్న కృషి అభినందనీయమని వారు పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ జిల్లాలోని మరిన్ని గ్రామాల్లో ఇటువంటి కార్యక్రమాలను నిర్వహిస్తూ ధార్మిక, సామాజిక చైతన్యాన్ని విస్తరించాలని నిర్వాహకులకు సూచించారు. జై శ్రీరామ్!
శ్రీ జొన్నలగడ్డ సుబ్రహ్మణ్యం
కార్యాలయ కార్యదర్శి
విశ్వ హిందూ పరిషత్ -- కృష్ణా జిల్లా

# వీరంపాలెంలో కన్నుల పండుగగా దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు




**తాడేపల్లిగూడెం అక్టోబర్ 19 (మీ వార్త ప్రతినిధి)** శ్రీ బాలా త్రిపుర సుందరి పీఠం, వీరంపాలెంలో దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు కన్నుల పండుగగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా సోమవారం అమ్మవారిని సిద్ధిదాత్రి రూపంలో పూజిస్తూ విశేష అర్చనలు జరిపారు. ఈ సందర్భంగా పీఠం నిర్వాహకులు బ్రహ్మశ్రీ గరిమెల్ల వెంకటరమణ శాస్త్రి మాట్లాడుతూ కోరిన కోరికలు సిద్ధించే రూపంలో సిద్ధిదాత్రి విశేష అనుగ్రహాన్ని కలిగిస్తుందని అన్నారు. నవరాత్రులలో ఈ తొమ్మిది రోజులు చేసిన విశేష సేవలకు అమ్మ అనుగ్రహించే రోజుగా ఈ రోజును అభివర్ణించారు. అనంతరం జరిగిన విశేష హోమాల్లో దేవభూమి డెవలపర్స్ మరియు మాజీ ఎలక్షన్ కమిషనర్ వాణి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా ప్రజలందరికీ దసరా శుభాకాంక్షలు

## జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

**మెదక్** రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలు, సాంస్కృతిక వైభవానికి ప్రతీకలుగా నిలిచే బతుకమ్మ, విజయదశమి (దసరా) పండుగలను పురస్కరించుకుని జిల్లా ప్రజలందరికీ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రకృతిలో సహజంగా లభించే వివిధ రకాల రంగురంగుల పూలతో అందంగా బతుకమ్మలను పేర్చి, మహిళలు, యువతులు, బాలికలు తొమ్మిది రోజుల పాటు సంప్రదాయబద్ధంగా ఆటపాటలతో బతుకమ్మ పండుగను భక్తిశ్రద్ధలతో, ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించుకోవడం తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతిబింబమని పేర్కొన్నారు. ప్రకృతిని ఆరాధిస్తూ, సామూహిక ఐక్యతను చాటిచెప్పే బతుకమ్మ పండుగ తెలంగాణ ప్రజల సాంస్కృతిక వారసత్వానికి ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. విజయదశమి పర్వదినం జిల్లా ప్రజలందరి జీవితాల్లో సుఖసంతోషాలు, శాంతిసౌభాగ్యాలు, ఆయురారోగ్యాలు, సిరిసంపదలు నింపాలని ఆకాంక్షించారు. దసరా పండుగ ప్రతి ఒక్కరిలో నూతనోత్సాహాన్ని నింపడంతో పాటు మరిన్ని విజయాలు సాధించేందుకు దోహదపడాలని కలెక్టర్ ఆకాంక్షించారు. జిల్లా ప్రజలందరూ బతుకమ్మ, విజయదశమి పండుగలను సంప్రదాయబద్ధంగా, భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ఈ సందర్భంగా సూచించారు.

## ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించాలి ----

## జిల్లా అదనపు కలెక్టర్ నగేష్

మెదక్ జిల్లా
ప్రజావాణి దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలనీ అదనపు కలెక్టర్ నగేష్ అధికారులకు సూచించారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా మెదక్ కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రజల నుంచి పిర్యాదులను స్వీకరించారు. మొత్తం( సాధారణ )16 దరఖాస్తులు వచ్చాయి. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ.. ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను తక్షణమే పరిశీలించి పరిష్కరించాలని, సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పి సీఈఓ ఎల్లయ్య, ఏ,వో యూనస్,జిల్లా అధికారులు పాల్గొన్నారు

## తెలంగాణ సంప్రదాయానికి ప్రతీక బతుకమ్మ.

## మంత్రి శ్రీధర్ బాబు.

**కమాన్ పూర్,** తెలంగాణ సంప్రదాయానికి ప్రతీక బతుకమ్మ వేడుకలు అని రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు అన్నారు. ఆదివారం రాత్రి కమాన్ పూర్ జిల్లా పరిషత్ పాఠశాల, కిష్టం పల్లె, గుండారం, రాజేంద్రనగర్ గ్రామాల్లో సధ్యుల బతుకమ్మ వేడుకల్లో రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పాల్గొన్నారు. తెలంగాణ ఆడబిడ్డల ఆత్మీయ పండుగ సద్దుల బతుకమ్మ వేడుకల్లో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పాల్గొన్నారు. ఆదివారం రాత్రి కమాన్ పూర్ మండల కేంద్రంలో జరిగిన సద్దుల బతుకమ్మ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మహిళలు అందంగా పేర్చిన బతుకమ్మల మధ్య మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని అన్నారు. ఆడబిడ్డలందరికీ సద్దుల బతుకమ్మ శు భాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని, ఆడబిడ్డల అభివృద్ధికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం మహిళలతో కలిసి బతుకమ్మ ఆడి, బతుకమ్మలకు హారతి ఇచ్చారు. మహిళలు ఆటపాటలతో సంబరంగా వేడుకలను జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తొట్ల తిరుపతి యాదవ్, ఏఎంసీ చైర్మన్ వైనాల రాజు, సర్పంచులు రంగు సత్యనారాయణ గౌడ్, జంగిలి పోచాలు, ఉపసర్పంచులు రఫీ సోహెల్, అంబిరి రాజేందర్, ఇనగంటి రామారావు అంబిరి శ్రీనివాస్ సుతారి రాజేందర్ పూల నర్సాగౌడ్, కమ్మ గోన చౌదరి గౌడ్, నాయకులు స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, మహిళా సంఘాల సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బతుకమ్మలో మంత్రి శ్రీధర్ బాబు ఫోటో

**కమాన్ పూర్** కమాన్ పూర్ మండలం జూలపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని ఆదర్శనగర్కు చెందిన యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు ఆయన సతీమణి సద్దుల బతుకమ్మ సందర్భంగా పేర్చిన బతుకమ్మలో తమ అభిమాన నాయకుడు శ్రీధర్ బాబు యొక్క ఫోటో పెట్టి తన అభిమానాన్ని చాటుకున్నారు. యూత్ కాంగ్రెస్ మాజీ జిల్లా అధ్యక్షుడు మంత్రి వర్యులు శ్రీధర్ బాబు ముఖ్య అనుచరుడు జెమినీ గౌడ్ కుటుంబ సభ్యులు ఆదర్శనగర్ ప్రజలు వినూత్న రీతిలో శ్రీధర్ బాబు చిత్రపటాన్ని బతుకమ్మలో ప్రదర్శించి తమ అభిమానాన్ని చాటారు. రాబోయే రోజుల్లో ప్రజలకి మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని,వారు ఆయురారోగ్యాలతో ఉండాలని ఆదర్శ నగర్ దుర్గామాత మండపంలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు,మహిళలు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ ని బలోపేతం చేస్తా

### జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి కుమార్ గౌడ్

**కమాన్ పూర్ (పాలకుర్తి) :** కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడమే తమ ప్రథమ ధ్యేయమని పాలకుర్తి మండలం రానాపూర్ గ్రామ దికి చెందిన బాలగోని కుమార్ గౌడ్ అన్నారు. ఈ మేరకు ఆయనకు రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రాష్ట్ర పిసిసి ప్రధాన కార్యదర్శి దుద్దిల్ల శీను బాబుల సూచన మేరకు పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శిగా నియమిస్తూ రామగుండం ఎమ్మెల్యే పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎంఎస్ రాజు ఠాగూర్ కుమార్ గౌడ్ కు ఉత్తర్వులను అందజేశారు. ఈ సందర్భంగా కుమార్ గౌడ్ మాట్లాడుతూ తమపై నమ్మకంతో రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు శీను బాబు మరియు ఎం ఎస్ రాజు ఠాగూర్ జిల్లా కార్యదర్శి పదవి అప్పగించడం జరిగిందని. వారి ఆశలను వమ్ము చేయకుండా పార్టీ బలోపేత్తమే ప్రథమ ధ్యేయంగా పనిచేస్తూ గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేస్తారని అన్నారు.



## మాలా వచ్చా చూడు.. చాలా తెచ్చా పాలు..!

అగ్ర కథానాయకుడు వెంకటేశ్ హీరోగా త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో 'ఆదర్శకుటుంబం --ూఖ 47'.. అనే ప్రకటన వచ్చిన నాటినుంచీ సినిమాపై ప్రేక్షకుల్లో అంచనాలు మొదలయ్యాయి. అత్యంత వినోదాత్మకంగా, కుటుంబ అనుబంధాలు, భావోద్వేగాలతో కూడిన కథాంశంతో త్రివిక్రమ్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రాన్ని హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై ఎస్.రాధాకృష్ణ(చినబాబు) నిర్మిస్తున్నారు. మ్యూజిక్ ప్రమోషన్స్‌లో భాగంగా సోమవారం ఈ సినిమా నుంచి రెండో పాటను మేకర్స్ విడుదల చేశారు. 'మాలా వచ్చా చూడు.. చాలా తెచ్చా పాలు.. నలగాలీ పూలూ ఒళ్లు.. అరవాలీ మంచం కోళ్లు' అంటూ సాగే ఈ రొమాంటిక్ మాస్ గీతాన్ని వెంకటేశ్, నివేదా పేతురాజ్‌లపై చిత్రీకరించారు. ఈ పాటలో వెంకీ, నివేదాల స్క్రీన్ ప్రెజన్స్, కెమిస్ట్రీ, ఉత్సహభరితమైన వారి అభినయం పాటకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. రామజోగయ్యశాస్త్రి రాసిన ఈ పాటను తమన్ స్వరపరచగా, ధనుంజయ్ సీపాన, రణినారెడ్డి ఆలపించారు. భాను మాస్టర్ నృత్య రీతుల్ని సమకూర్చారు. త్వరలోనే ట్రైలర్ విడుదల కానున్నది. శ్రీనిధిశెట్టి కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: రవి కె.చంద్రన్.



## నాని బ్లడీ రోమియో షూటింగ్ షురూ..

### ఇంతకీ లొకేషన్ ఎక్కడో తెలుసా..?

రీసెంట్‌గా శ్రీకాంత్ ఓదెల డైరెక్షన్‌లో ప్యారడైజ్ మూవీతో ప్రేక్షకుల ముందుకొచ్చాడు నాని. ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద మిక్స్‌డ్ టాక్ తెచ్చుకుంది. అక్టోబర్ 22న నెట్‌ఫ్లిక్స్‌లో కూడా సందడి చేయబోతుంది. కాగా ఇక తన నెక్ట్స్ మూవీ బ్లడీ రోమియో (దీశ్రీశీసఎ =శీఎవశీ)పై ఫోకస్ షిఫ్ట్ చేశాడు నాని. అభిమానులు, మూవీ లవర్స్ ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న షూటింగ్ టైం రానే వచ్చింది. ఫిలింనగర్ సర్కిల్ సమాచారం ప్రకారం దేశరాజధాని నగరం ఢిల్లీలో బ్లడీ రోమియో షూటింగ్ మొదలైంది. ఢిల్లీలో వారంపాటు ఈ తొలి షెడ్యూల్ కొనసాగనుందట. ఢిల్లీ షూటింగ్ తర్వాత నాని టీం నెక్ట్స్ షెడ్యూల్ కోసం హైదరాబాద్‌కు పయనం కానుందని ఇన్‌సైడ్ టాక్. ఇదిలా ఉంటే ఇంతకీ నానితో రొమాన్స్ చేయబోయే భామ ఎవరనేది ఇంకా సస్పెన్స్‌లోనె పెట్టేశారు మేకర్స్.. నిహారికా ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై వెంకట్ బోయనపల్లి నిర్మిస్తున్న ఈ చిత్రానికి ప్రవీణ్ లక్కరాజు సంగీతం అందిస్తున్నాడు. మేకర్స్ ఈ మూవీని 2027 వేసవి కానుకగా విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నారు. నాని ఈ సారి సూపర్ స్టైలిష్‌గా కనిపించబోతున్నట్టు బ్లడీ రోమియో టీం ఇటీవలే రిలీజ్ చేసిన వీడియో ద్వారా క్లారిటీ ఇచ్చేశారు మేకర్స్. నాని ఇందులో గ్యాంగ్‌స్టర్ నుంచి చెఫ్‌గా మారిన వ్యక్తిగా కనిపించబోతున్నాడని ఇన్‌సైడ్ టాక్. స్టైలిష్ హెయిర్ అండ్ బ్లాక్ గూగుల్స్ లో మేకోవర్ అయిన నాని లుక్‌తోపాటు సుజీత్ టీం ఫుడ్ ట్రక్‌పై.. దీశ్రీశీసఎ =శీఎవశీ.. ఎష్ట్రవ ఖఙఎష్ట్రవఅ ాజూవఅ ాశీశీఅ అని రాసిన వీడియోను షేర్ చేయగా నెట్టింట వైరల్ అవుతోంది.

## 'జైలర్ 2' బాక్సాఫీస్ సునామీ.. మూడు రోజుల్లోనే రూ.317 కోట్లకు పైగా వసూళ్లు!




సూపర్‌స్టార్ రజనీకాంత్ మరోసారి బాక్సాఫీస్ వద్ద తన సత్తా చాటుతున్నారు. ఆయన ప్రధాన పాత్రలో నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన యాక్షన్ ఎంటర్‌టైనర్ 'జైలర్ 2' థియేటర్లలో భారీ వసూళ్లతో దూసుకెళ్తోంది. సన్ పిక్చర్స్ నిర్మించిన ఈ చిత్రం విడుదలైన తొలి రోజు నుంచే ప్రేక్షకుల నుంచి మంచి స్పందన అందుకుంటూ బాక్సాఫీస్ వద్ద రికార్డుల దిశగా సాగుతోంది. ట్రేడ్ వర్గాల అంచనాల ప్రకారం, కేవలం మూడు రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ.317.15 కోట్ల గ్రాస్ వసూళ్లను సాధించింది. ఈ నెల 15న ప్రేక్షకుల ముందుకు వచ్చిన 'జైలర్ 2' తొలి వారాంతంలోనే భారీ వసూళ్లు సాధించినట్లు ట్రేడ్ లెక్కలు చెబుతున్నాయి. ముఖ్యంగా తమిళనాడులో రజనీకాంత్‌కు ఉన్న క్రేజ్ ఈ సినిమాకు పెద్ద బలంగా మారింది. తెలుగు రాష్ట్రాల్లోనూ సినిమాకు మంచి స్పందన లభిస్తుండటంతో పలు ప్రాంతాల్లో థియేటర్లు ప్రేక్షకులతో సందడిగా కనిపిస్తున్నాయి. అందుబాటులో ఉన్న వసూళ్ల అంచనాల ప్రకారం, మూడు రోజుల్లో భారతదేశంలో రూ.169.65 కోట్ల గ్రాస్, రూ.144.60 కోట్ల నెట్ వసూళ్లు నమోదయ్యాయి. విదేశీ మార్కెట్లలోనూ సినిమా మంచి ప్రదర్శన కనబరుస్తుండటంతో ప్రపంచవ్యాప్త వసూళ్లు రూ.317.15 కోట్లకు చేరినట్లు సమాచారం. శనివారం ఒక్కరోజే దేశవ్యాప్తంగా 14,604 షోల ద్వారా 'జైలర్ 2' రూ.47.8 కోట్ల నెట్ వసూళ్లు సాధించినట్లు నివేదికలు పేర్కొంటున్నాయి. ప్రాంతాలవారీగా వసూళ్ల వివరాలు ఇలా ఉన్నాయి. తమిళనాడు 7,802 షోల ద్వారా రూ.34.6 కోట్ల నెట్ వసూళ్లు, తెలుగు రాష్ట్రాలు 2,100 షోల ద్వారా రూ.8.50 కోట్ల నెట్ వసూళ్లు, ఉత్తర భారతదేశంలో 4,554 షోల ద్వారా రూ.4.25 కోట్ల నెట్ వసూళ్లు, కర్ణాటకలో కన్నడ వెర్షన్ ద్వారా 148 షోలతో రూ.45 లక్షల నెట్ వసూళ్లు సాధించినట్టు తెలుస్తుంది. ఈ లెక్కలను బట్టి తమిళనాడులో సినిమా ప్రభావం ఎంత బలంగా ఉందో అర్థమవుతోంది. తెలుగు రాష్ట్రాల్లోనూ గణనీయమైన వసూళ్లు నమోదవడం చిత్ర బృందానికి ఊరటనిచ్చే అంశం. భారతదేశంతో పాటు విదేశీ మార్కెట్లలోనూ 'జైలర్ 2' మంచి వసూళ్లు సాధిస్తున్నట్లు సమాచారం. అమెరికా, బ్రిటన్, గల్ఫ్ దేశాలు, ఆస్ట్రేలియా, మలేషియా వంటి ప్రాంతాల్లో సినిమాకు ఆదరణ లభిస్తోంది. మూడో రోజు ఒక్కరోజే విదేశాల్లో రూ.47.5 కోట్ల గ్రాస్ వసూళ్లు వచ్చినట్లు ట్రేడ్ నివేదికలు పేర్కొంటున్నాయి.దీంతో ఇప్పటివరకు ఓవర్సీస్ మార్కెట్‌లో మొత్తం గ్రాస్ వసూళ్లు రూ.147.50 కోట్లకు చేరినట్లు అంచనా. భారతదేశంలో రూ.169.65 కోట్ల గ్రాస్ వసూళ్లు కలిపితే ప్రపంచవ్యాప్తంగా మొత్తం రూ.317.15 కోట్ల గ్రాస్ నమోదైనట్లు సమాచారం.

## రాపో ప్రపంచంలోకి రితేశ్ దేశ్‌ముఖ్



హీరో రామ్ పోతినేని స్వీయ దర్శకత్వంలో నటిస్తున్న చిత్రం '=ూూూ 23'(వర్కింగ్ టైటిల్). దర్శకునిగా రామ్ డెబ్యూ సినిమా కావడంతో దాదాపు వందకోట్ల నిర్మాణ వ్యయంతో నిర్మాత కృష్ణ పోతినేని ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో ఈ సినిమా చిత్రీకరణ జరుపుకుంటున్నది. ఇదిలావుంటే.. ఇందులోని ఓ కీలక పాత్రను బాలీవుడ్ నటుడు రితేశ్ దేశ్‌ముఖ్ పోషిస్తున్నారు. రీసెంట్‌గా ఈ సినిమా షూటింగ్‌లో కూడా ఆయన పాల్గొన్నట్టు చిత్రబృందం సోమవారం ఓ ప్రకటన ద్వారా తెలియజేసింది. ఏక్ విలన్, రైడ్ 2, రాజా శివాజీ చిత్రాలతో అద్భుతమైన నటుడిగా గుర్తింపు తెచ్చుకున్న రితేష్ దేశ్‌ముఖ్ తమ సినిమాలో భాగం కావడం పట్ల చిత్రబృందం ఆనందం వెలిబుచ్చింది. ఈ సందర్భంగా షూటింగ్ లొకేషన్‌లో తీసిన ఓ వీడియోను కూడా విడుదల చేశారు. సినిమా కోసం నిర్మించిన భారీ సెట్‌నీ, రితేశ్ దేశ్‌ముఖ్ సెట్‌లోకి అడుగుపెడుతున్న దృశ్యాలను ఈ వీడియో పొందుపరిచారు. ఈ సినిమా ఓ సరికొత్త ప్రపంచాన్ని ఆవిష్కరిస్తుందని, రితేష్ పాత్ర విభిన్నంగా ఉంటుందని మేకర్స్ చెబుతున్నారు. సంయుక్త మీనన్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: తిరునవుక్కరసు, సంగీతం: సామ్ పీఎస్.